# విశాల భారతి

తెలుగు దినపత్రిక

21-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 76


అతి పెద్ద చమురు శుద్ధి

## కేంద్రంపై ఇరాన్ దాడి

- పశ్చిమాసియా ఉద్రిక్తతలపై 6 ముఖ్యాంశాలు అత్యంత సంక్షిప్తంగా
- ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య క్షిపణి, డ్రోన్ దాడులతో బహిరంగ పోరు
- ఖమేనీ మరణం తర్వాత మొజ్తబా పగ్గాలు, అజ్ఞాతంలోనే ఆదేశాలు
- కువైట్ రిఫైనరీలపై ఇరాన్ దాడులతో ప్రపంచ ఇంధన మార్కెట్ ఆందోళన
- ఇరాన్‌ను అడ్డుకునేందుకు అదనంగా 4,000 మంది మెరైన్ల మోహరింపు
- టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాల బాంబుల వర్షం
- అగ్రరాజ్యాలు చీలిపోయి మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీసే భయం



03

తెలంగాణ రాష్ట్ర ప్రగతి చక్రం కొత్త వేగంతో పరుగులు తీయడానికి సిద్ధమైంది. తాజాగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ కేవలం అంకెల గారడీ మాత్రమే కాదు, ప్రతి సామాన్యుడి కలలను నిజం చేసే ఒక గొప్ప భరోసా అని చెప్పవచ్చు. సుమారు మూడు లక్షల ఇరవై నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయింపులతో రూపొందించిన ఈ బడ్జెట్ ద్వారా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ అంతిమ లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఈ ప్రణాళికను సిద్ధం చేశారు. అటు శాసనమండలిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ బడ్జెట్ వివరాలను వెల్లడించి ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటారు.




# ₹ 3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్

## ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల 'ఇందిరా జీవిత బీమా' రక్షణ

- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ. 5 వేల కోట్లు, ఇంటర్ వరకు భోజనం
- వ్యవసాయ రంగానికి రూ. 23 వేల కోట్లు, పంటలకు బోనస్
- ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత డిజిటల్ హెల్త్ కార్డులు
- ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సబ్సిడీకి భారీ నిధులు
- ఆరు హామీల కోసం ఏకంగా రూ. 50,713 కోట్ల కేటాయింపు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ప్రగతి చక్రం కొత్త వేగంతో పరుగులు తీయడానికి సిద్ధమైంది. తాజాగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ కేవలం అంకెల గారడీ మాత్రమే కాదు, ప్రతి సామాన్యుడి కలలను నిజం చేసే ఒక గొప్ప భరోసా అని చెప్పవచ్చు. సుమారు మూడు లక్షల ఇరవై



నాలుగు వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయింపులతో రూపొందించిన ఈ బడ్జెట్ ద్వారా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ అంతిమ లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఈ ప్రణాళికను సిద్ధం చేశారు. అటు శాసనమండలిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ బడ్జెట్ వివరాలను వెల్లడించి ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటారు. ఈ బడ్జెట్‌లో సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' నిజంగా ఒక గేమ్ ఛేంజర్ అని చెప్పాలి. రాష్ట్రంలోని కోటి పదిహేను లక్షల కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించడం ద్వారా మధ్యతరగతి, పేద వర్గాలకు కొండంత అండ లభించనుంది. వచ్చే జూన్ రెండో తేదీ నుంచి అమల్లోకి రానున్న ఈ పథకం కోసం ప్రభుత్వం ఇప్పటికే నాలుగు వేల కోట్ల రూపాయలను సిద్ధం చేసింది.

మిగతా 2లో..

ప్రజా ప్రభుత్వం చేసిన అప్పు

## రూ. 3.47 లక్షల కోట్లు



- గత ప్రభుత్వం చేసిన రూ. 3.30 లక్షల కోట్ల అప్పులు తీర్చడమే లక్ష్యం
- అవినీతిని తగ్గించి, ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడంపై దృష్టి
- ఇది కేవలం అంకెలు కాదని, రాష్ట్ర వృద్ధికి 'ఫ్యూచరిస్టిక్' బడ్జెట్
- ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల 'ఇందిరా జీవిత బీమా' పథకం
- స్కూళ్లలో నూతన విద్యా విధానం, ఉచిత వైద్యం అందించడం
- సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి అభివృద్ధి

02

## 'భట్టి' బడ్జెట్ బడా ఝూటా బడ్జెట్

- ఆరు గ్యారెంటీలకు నిధులు ఇవ్వకుండా ప్రజలను వంచించారు
- బడ్జెట్ అంతా అబద్ధం, కేటాయింపుల్లో చిత్తశుద్ధి లేదు
- రెండేళ్లలోనే డెట్ జీఎస్డీపీ 27శాతం నుండి 29శాతానికి పెరిగింది
- మహిళలకు రూ. 2500, వృద్ధులకు రూ. 4000 పెన్షన్లు ఊసేలేదు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్లకు, ఉద్యోగుల బకాయిలకు దిక్కులేదు
- గురుకులాల్లో వసతులు లేవు, పెట్టుబడులన్నీ కట్టుకథలే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్‌ఎస్‌ఎల్పీ డెప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. బడ్జెట్ ప్రసంగం ముగిసిన అనంతరం బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్ కేవలం అంకెల గారడీ అని, ప్రజలను దారుణంగా వంచించడమే లక్ష్యంగా సాగిందని

మిగతా 2లో..



## ఆరు గ్యారంటీలకు పాడె కట్టారు

- ఆదాయం పెంచే మార్గం లేదు, కేవలం అప్పల కోసమే ఈ అంకెల గారడీ
- రైతు భరోసా నిధులు ఎగ్గొట్టి అన్నదాతలను నిలువునా ముంచారు
- 16శాతం నిధులు ఇవ్వాల్సింది పోయి, కేవలం 8శాతంతో సరిపెట్టారు
- ఆరోగ్యశ్రీ పాత బకాయిలే తీర్చలేదు, కొత్తగా వైద్యం ఎలా ఇస్తారు
- 56శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం 4శాతం నిధులే కేటాయించారు
- దేవాదాయ శాఖకు, పుష్కరాలకు నిధులు ఇవ్వడంలో వివక్ష చూపారు

04



## ఇదొక ఫేక్ బడ్జెట్

- 56శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం 4శాతం నిధులే ఇచ్చి వంచించారు
- సంపద సృష్టించకుండా రాష్ట్రాన్ని అప్పల ఊబిలోకి నెట్టారు
- ప్రత్యేక మంత్రిత్వ శాఖ హామీ ఏమైంది? గిరిజన శాఖే లేదు



02



## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

- లీటరుకు రూ.2 మేర పెరిగిన ప్రీమియం పెట్రోల్
- వచ్చే వారం తప్పని పెట్రోల్ మోత?
- లీటరుకు రూ.3 నుంచి రూ.5 వరకు పెరిగే చాన్స్
- పశ్చిమాసియా పరిస్థితులే ప్రధాన కారణం
- డీజిల్‌పైనా వడ్డింపు తప్పదంటున్న చమురు సంస్థలు

03

## ఇరాన్ సైనికాధికారి హతం

- ఇరాన్ ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి నయినీ ఇజ్రాయెల్ దాడిలో హతం
- నెతన్యాహును హెచ్చరించిన కొద్దిసేపటికే ప్రాణాలు కోల్పోయారు
- క్షిపణి రంగాన్ని నడిపించే బలమైన గొంతుక మూగబోయింది
- ఒకే వారంలో నయినీ, లారిజానీ, సాల్మనీలను ఇరాన్ కోల్పోయింది
- ఇరాన్ రక్షణ వలయాన్ని ఇజ్రాయెల్ సులువుగా ఛేదిస్తోంది
- కీలక నేతల మరణంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పతాకస్థాయికి



03

## 2014నుంచి 6వేల ఫోన్లు ట్యాప్

- గత ప్రభుత్వం వేల మంది వ్యక్తిగత స్వేచ్ఛను హరించింది
- సాంకేతిక విచారణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దర్యాప్తు వేగవంతం
- నిబంధనలు మీరిన అధికారులపై వేటు, బాధ్యులెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- ప్రభాకర్ రావు స్టేట్‌మెంట్‌తో అసలు సూత్రధారులు త్వరలో బయటపడతారు
- కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందన్నది అబద్ధం, అది పాత ప్రైవేట్ కేసు

03






## ప్రజా ప్రభుత్వం చేసిన అప్పు

# రూ. 3.47 లక్షల కోట్లు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ ఆర్థిక పునర్నిర్మాణమే లక్ష్యంగా, గత పాలకుల వైఫల్యాలను సరిదిద్దుతూ రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేసే దిశగా తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం నిర్వహించిన చిట్ చాట్‌లో ముఖ్యమంత్రి ప్రస్తుత ఆర్థిక పరిస్థితిపై కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న సవాళ్లను వివరిస్తూనే, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యతను ఎలా సాధిస్తున్నామో ఆయన వివరించారు. ముఖ్యంగా అప్పుల విషయంలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ, రాష్ట్ర ప్రజలకు వాస్తవాలను వెల్లడించాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు సుమారు 3.47 లక్షల కోట్ల రూపాయల మేర అప్పులు సేకరించాల్సి వచ్చిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అయితే ఈ భారీ మొత్తంలో సింహభాగం అంటే దాదాపు 3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పుల తీర్చడానికే, వాటి వడ్డీల చెల్లింపులకే ఖర్చయిందని ఆయన వివరించారు. పాత అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని గట్టెక్కించేందుకు తాము తీవ్రంగా శ్రమిస్తున్నామని, గత ప్రభుత్వ ఆర్థిక అరాచకత్వం వల్ల కలిగిన నష్టాన్ని పూడ్చేందుకు ఈ చెల్లింపులు తప్పనిసరి అయ్యాయని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షోభంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే తమ ప్రథమ కర్తవ్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకోవడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఏళ్ల తరబడి జరుగుతున్న లీకేజీలను అరికట్టడం ద్వారా ఖజానాకు చేరాల్సిన నిధులు పక్కదారి పట్టకుండా చూస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అవినీతికి తావు లేకుండా పాలనను ప్రక్షాళన చేయడం ద్వారా రాబడిని పెంచుతున్నామని, అదే సమయంలో కేంద్రం నుండి తెలంగాణకు రావాల్సిన రాజ్యాంగబద్ధమైన నిధులను సాధించుకోవడంలో ఎక్కడా వెనకడుగు వేయడం లేదని ఆయన వివరించారు. రాష్ట్ర హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తూనే, కేంద్రంతో సమన్వయం పాటిస్తూ నిధుల సమీకరణ చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

తాజా బడ్జెట్‌ను 'ఫ్యూచరిస్టిక్' బడ్జెట్‌గా అభివర్ణించిన రేవంత్ రెడ్డి, ఇది కేవలం అంకెల గారడీ కాదని, తెలంగాణ భవిష్యత్ ఆర్థిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ప్రణాళిక అని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు, ప్రజా సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ నిధుల కేటాయింపు జరిగిందని ఆయన వివరించారు. మౌలిక వసతుల కల్పనే రాష్ట్ర ప్రగతికి ఇంధనం అని నమ్ముతున్నామని, అందుకే రహదారులు, ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాల కోసం సరిపడే నిధులను ఈ బడ్జెట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్య సాధనకు ఈ బడ్జెట్ ఒక పెద్ద పీటగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని ప్రతి వర్గానికి, ప్రతి రంగానికి ఈ బడ్జెట్‌లో సముచిత స్థానం కల్పించామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా సామాన్యుడి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రతి కుటుంబానికి భరోసా కల్పించేందుకు 'ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం' ప్రవేశపెట్టడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని కోటి పదిహేను లక్షల కుటుంబాలకు రక్షణ కల్పిస్తున్నామని, ఏదైనా అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు సదరు కుటుంబానికి ఐదు లక్షల రూపాయల బీమా పరిహారం అందుతుందని ఆయన వివరించారు.

విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్ర విద్యా వ్యవస్థను సంస్కరిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రీప్రైమరీ స్థాయి నుంచి ప్లస్ టూ వరకు ఒకే ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో చదువుకునేలా నూతన విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. దీనివల్ల విద్యార్థులకు నిరంతర విద్యా బోధన అందడమే కాకుండా, మధ్యలో చదువు మానేసే వారి సంఖ్య తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. విద్యారంగ సంస్కరణలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ నిధుల కేటాయింపులో ఉదారంగా వ్యవహరించామని ఆయన చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలోనూ ఈ బడ్జెట్ స్పష్టమైన దిశానిర్దేశం చేసిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి వైద్య మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని, ఆసుపత్రుల ఆధునీకరణ మరియు మందుల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామని వివరించారు. గతం కంటే మెరుగైన ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించడమే తమ లక్ష్యమని, దీని కోసం బడ్జెట్‌లో గణనీయమైన నిధులను కేటాయించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెంచేలా సదుపాయాల కల్పన జరుగుతోందని, ప్రతి పౌరుడికి ఉచిత వైద్యం అందించే దిశగా అడుగులు వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

అప్పుల సేకరణ, రాష్ట్ర ఆదాయ వనరుల వినియోగం విషయంలో తమ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి పైసా ఖర్చుపై ప్రజలకు జవాబుదారీగా ఉంటామని, గతంలో జరిగినట్లుగా గోప్యతకు తావులేదని ఆయన అన్నారు. అప్పులు ఎందుకు చేయాల్సి వచ్చింది, వాటిని ఎలా వినియోగించాము అనే అంశాలపై అన్ని వివరాలను బహిరంగంగా ఉంచామని, ఇది కేవలం ప్రజల ప్రభుత్వం కాబట్టే సాధ్యమైందని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూనే అభివృద్ధి ఫలాలు కింది స్థాయి వరకు చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ముఖ్యంగా రైతు సంక్షేమం మరియు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ బడ్జెట్ ఊతమిస్తుందని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తితో పాటు, రైతులకు పెట్టుబడి సాయం మరియు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని ఆయన హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచడం ద్వారా వలసలను నిరోధించవచ్చని, అందుకు తగ్గట్లుగా కుటీర పరిశ్రమలు మరియు వ్యవసాయాధారిత యూనిట్లకు చేయూతనిస్తామని తెలిపారు. సామాజిక న్యాయం పాటిస్తూనే ఆర్థికాభివృద్ధిని సాధించడం తమ ప్రభుత్వ ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. నగరాల అభివృద్ధిని కూడా విస్మరించలేదని, హైదరాబాద్ వంటి మెట్రో నగరాలను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దడానికి అవసరమైన వ్యూహాలను బడ్జెట్‌లో పొందుపరిచామని రేవంత్ రెడ్డి వివరించారు. మెట్రో విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ మరియు పర్యావరణ పరిరక్షణ చర్యల కోసం ప్రత్యేక నిధులను కేటాయించామని చెప్పారు. రాష్ట్రంలోని ఇతర పట్టణాలను కూడా అభివృద్ధి కేంద్రాలుగా మారుస్తామని, తద్వారా రాష్ట్రం నలుమూలల నుంచి ఆర్థిక వృద్ధి నమోదవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో తెలంగాణ ఒక బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ఆయన ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ముగింపులో, ఈ బడ్జెట్ తెలంగాణ పునర్నిర్మాణానికి ఒక దిక్సూచి అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విపక్షాలు చేసే విమర్శల్లో పస లేదని, తాము వాస్తవాలకు దగ్గరగా ఉంటూ ప్రజల అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించామని చెప్పారు. సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన చరిత్ర తమది కాదని, బాధ్యతాయుతమైన పాలనతో రాష్ట్రాన్ని అగ్రపథాన నిలుపుతామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. ప్రజల సహకారంతో, పారదర్శకమైన విధానాలతో తెలంగాణను 'రైజింగ్ స్టేట్'గా మార్చడమే తమ అంతిమ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమాగా ప్రకటించారు.

# ఇదొక ఫేక్ బడ్జెట్

- 56శాతం జనాభా ఉన్న బీసీలకు కేవలం 4శాతం నిధులే ఇచ్చి వంచించారు
- సంపద సృష్టించకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు
- ప్రత్యేక మంత్రిత్వ శాఖ హామీ ఏమైంది? గిరిజన శాఖే లేదు
- కేంద్రం నుండి రావాల్సిన రూ. 22 వేల కోట్లు తేవడంలో సీఎం విఫలం
- ఇందిరమ్మ ఇళ్లు, ఆరు గ్యారంటీలు కేవలం కాగితాలకే పరిమితం
- ఉద్యోగ నోటిఫికేషన్లు, స్కూటీలు, నిరుద్యోగ భృతిపై స్పష్టత లేదు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయ యవనికపై 202627 వార్షిక బడ్జెట్ ప్రకంపనలు సృష్టిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఈ పద్దులపై తెలంగాణ జాగృతి సారథి కల్వకుంట్ల కవిత తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. ఈ బడ్జెట్ సామాన్యుడి ఆశలకు ఊపిరి పోయాల్సింది పోయి, కేవలం అంకెల గారడీగా మిగిలిపోయిందని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన వెనుకబడిన తరగతుల సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం గాలికి వదిలేసిందని, ఇది కేవలం వర్గ ప్రయోజనాల కోసమే రూపొందించిన పత్రం లాగా కనిపిస్తోందని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర జనాభాలో సుమారు 56 శాతం మంది ఉన్న బీసీలకు బడ్జెట్ కేటాయింపుల్లో కేవలం 4 శాతం నిధులు మాత్రమే ఇవ్వడం దారుణమని కవిత పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో బీసీ డిక్లరేషన్ పేరిట భారీ హామీలు గుప్పించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించిందని ఆరోపించారు. ఏడాదికి రూ. 20 వేల కోట్లు బీసీ సంక్షేమానికి ఖర్చు చేస్తామని ఊదరగొట్టిన నాయకులు, తీరా బడ్జెట్‌లో కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే చూపించి వెనుకబడిన కులాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇది స్పష్టంగా బీసీలను మోసం చేయడమేనని ఆమె తేల్చి చెప్పారు.

అత్యంత వెనుకబడిన కులాల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన కాంగ్రెస్, ప్రస్తుత బడ్జెట్ ప్రసంగంలో ఆ ఊసే ఎత్తకపోవడం విచారకరమని కవిత అన్నారు. ఎంబీసీ వర్గాలు నేటికీ అనేక సామాజిక, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా ఆ దిశగా అడుగులు పడటం లేదని విమర్శించారు. ఒకవైపు ఎంబీసీలకు అన్యాయం జరుగుతుంటే, మరోవైపు రాష్ట్ర క్యాబినెట్‌లో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించే మంత్రిత్వ శాఖే లేకపోవడం ఈ ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని ఆమె దుయ్యబట్టారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరుపై కూడా కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. పేదవాడికి సొంతింటి కలను నిజం చేస్తామని చెప్పి, క్షేత్రస్థాయిలో ఇళ్ల మంజూరులో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. కేటాయింపులు భారీగా ఉన్నట్లు చూపిస్తున్నా, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లేదని, నిధుల విడుదల నత్తనడకన సాగుతోందని పేర్కొన్నారు. ఇది ప్రజా ఉపయోగం లేని బడ్జెట్ అని, ఇందులో విజన్ లేదని, కేవలం ప్రజలను మభ్యపెట్టేందుకే కొన్ని గణాంకాలను కుప్పపోశారని ఆమె ఘాటుగా స్పందించారు. విజన్ ఉన్న నాయకత్వం ఉంటే రాష్ట్రం ఇలాంటి అయోమయ స్థితిలో ఉండేది కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తున్నప్పటికీ, రాష్ట్రానికి రావలసిన నిధుల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యారని కవిత గుర్తు చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన రూ. 22 వేల కోట్ల బకాయిలను ఎందుకు తీసుకురాలేకపోతున్నారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పర్యటనలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప, రాష్ట్ర అభివృద్ధి కోసం కాదని ఈ బడ్జెట్ నిరూపిస్తోందని ఆమె విమర్శించారు. కేంద్రం నుంచి నిధులు సాధించలేని చేతకానితనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కప్పిపుచ్చుకుంటోందని ఆమె ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కవిత ఆందోళన వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ హయాంలో అప్పుల భారం భారీగా పెరుగుతోందని హెచ్చరించారు. అభివృద్ధి పనుల కంటే అప్పులు చేయడానికే ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, దీనివల్ల రాష్ట్రంలోని ప్రతి ఒక్క పౌరుడిపై భారం పడుతోందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఒక్కో వ్యక్తిపై సగటున రూ. 2 లక్షల 16 రూపాయల అప్పు ఉందని ఆమె గణాంకాలతో సహా వివరించారు. ఈ స్థాయి అప్పులు భవిష్యత్ తరాలను కుంగదీస్తాయని, సంపద సృష్టించకుండా కేవలం అప్పులతో కాలం గడపడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆమె చురకలంటించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై కూడా కవిత నిప్పులు చెరిగారు. పేదలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా వెనుకబడిందని, కేవలం ప్రచారానికే పరిమితమైందని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఇస్తామన్న సాయం కానీ, రైతు భరోసా కానీ ఆశించిన స్థాయిలో అందడం లేదని మండిపడ్డారు. అట్టహాసంగా ప్రకటించిన పథకాలన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయని, ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్ మార్కు పాలన చూసి విసుగు చెందుతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో మార్పు కనిపించడం లేదని ఆమె స్పష్టం చేశారు. యువతకు స్కూటీలు ఇస్తామని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని కవిత ప్రశ్నించారు. ఈ బడ్జెట్‌లో ఆ పథకాలకు సంబంధించిన స్పష్టమైన కేటాయింపులు లేవని, ఇది ఆడబిడ్డలను వంచించడమేనని ఆమె అన్నారు. కేవలం ఓట్లు దండుకోవడానికే ఇటువంటి ఆకర్షణీయమైన హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ఆ వర్గాలను విస్మరించడం కాంగ్రెస్ నైజమని ఆమె విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులు, మహిళలు ఈ హామీల కోసం ఎదురుచూస్తున్నారని, వారి నమ్మకాన్ని ప్రభుత్వం వమ్ము చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును కవిత తీవ్రంగా ఖండించారు. లక్షలాది మంది యువతీ యువకులు ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారని, కానీ ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్లు ఇవ్వడంలోనూ, ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంలోనూ విఫలమైందని అన్నారు. నిరుద్యోగ భృతి ఊసే లేదని, ఉద్యోగ కల్పనపై బడ్జెట్‌లో సరైన రోడ్ మ్యాప్ లేకపోవడం యువతను నిరాశకు గురిచేసిందని పేర్కొన్నారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన యువతను కాంగ్రెస్ నట్టేట ముంచిందని ఆమె ఆరోపించారు. మొత్తంగా ఈ 202627 బడ్జెట్ అటు సామాన్యుడికి, ఇటు రైతులకు, మరోవైపు యువతకు ఎవరికీ ఉపయోగపడదని కవిత విశ్లేషించారు. సంక్షేమ పథకాలకు నిధుల కోత విధించి, అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని మారుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పారదర్శకత లేని కేటాయింపులు, గమ్యం లేని ప్రణాళికలతో ఈ బడ్జెట్ రూపొందించారని, ఇది కేవలం అంకెలతో ఆడుకునే ఫేక్ బడ్జెట్ మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే తక్షణమే బీసీలకు కేటాయింపులు పెంచాలని , గిరిజన మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన తెలంగాణ జాగృతి ఎప్పుడూ పోరాడుతుందని, ఈ బడ్జెట్ లోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని కవిత హెచ్చరించారు.

## 'భట్టి' బడ్జెట్ బడా ఝూటా బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి**



ఆయన విమర్శించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే పేజీలు పెరిగాయి, అంకెలు పెరిగాయి తప్ప సామాన్యుడి కష్టాలను తీర్చే దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఈ బడ్జెట్‌తో ఆ గ్యారెంటీలకు రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క కలిసి విజయవంతంగా 'ఘోరీ' కట్టారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర సంపదను పెంచడం పక్కన పెట్టి, కేవలం కాగితాల మీద లెక్కలు చూపించి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో చిత్తశుద్ధి ఎక్కడా కనిపించడం లేదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ డిక్లరేషన్లన్నీ కేవలం ఓట్ల కోసమేనని ఈ బడ్జెట్ కేటాయింపులు నిరూపించాయని విమర్శించారు. గత ఏడాది బడ్జెట్‌లో ప్రకటించిన పథకాలే మళ్ళీ ఈసారి కూడా ప్రస్తావించారని, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలకు రూపాయి విదిల్చలేదని ధ్వజమెత్తారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ పేర్లను వాడుకుంటూ వారి ఆత్మ ఘోషించేలా పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేటాయించిన 6 వేల కోట్లు ఏమయ్యాయో చెప్పకుండానే, మళ్ళీ అదే అంకెను తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఈ బడ్జెట్‌కు ఎలాంటి పవిత్రత లేదని, ఇది పూర్తిగా 'బడా ఝూటా' బడ్జెట్ అని ఆయన అభివర్ణించారు. అభయహస్తం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ప్రజలకు 'రిక్తహస్తం' చూపిస్తోందని విమర్శించారు. తెలంగాణ సమాజంలోని ప్రతి వర్గాన్ని ఈ ప్రభుత్వం మోసం చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. మహిళలకు నెలకు 2500 రూపాయల నగదు బదిలీ చేస్తామన్న హామీ ఏమైందని ఆయన నిలదీశారు. వృద్ధులకు 4 వేల రూపాయల పెన్షన్, ఉద్యోగుల పాత బకాయిలు, పీఆర్సీ అమలు విషయంలో ప్రభుత్వం మొండి చేయి చూపిందని మండిపడ్డారు. ఆర్టీసీ కార్మికులు, సింగరేణి కార్మికులు, చేనేత, గౌడన్నలు, యాదవ సోదరుల సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని, ఏటా 20 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయని విమర్శించారు. మూడో బడ్జెట్ ప్రవేశపెట్టినా బీసీలకు ఒరిగిందేమీ లేదని, అన్ని వర్గాల ప్రజలకు దక్కింది 'గుండు సున్నా' మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. సమాజంలోని అట్టడుగు వర్గాల నుంచి అగ్రవర్ణ పేదల వరకు అందరినీ ఈ బడ్జెట్ నిరాశకు గురిచేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న మాటలకు, బడ్జెట్ లెక్కలకు పొంతన లేదని హరీశ్‌రావు ఎత్తిచూపారు. రేవంత్ రెడ్డి రాష్ట్రం దివాలా తీసిందని ప్రచారం చేస్తుంటే, భట్టి విక్రమార్క మాత్రం జీఎస్డీపీ దేశ సగటు కంటే ఎక్కువగా ఉందని చెబుతున్నారని, వీరిలో ఎవరి మాట నమ్మాలో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. మూడేళ్లు నిండకముందే ప్రభుత్వం మూడున్నర లక్షల కోట్ల అప్పులు చేసిందని, కానీ ఆ నిధులతో చేపట్టిన అభివృద్ధి ఏంటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో అతి తక్కువ డెట్‌జీఎస్డీపీ రేషియో ఉన్న రాష్ట్రంగా తెలంగాణ ఉండేదని, కానీ కాంగ్రెస్ రెండేళ్ల పాలనలోనే అది 27 శాతం నుంచి 29 శాతానికి పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పులు చేయడంలో ఉన్న ఉత్సాహం పథకాల అమలులో లేదని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో రాజ్యాంగ విలువలు, అంబేద్కర్ సూక్తుల గురించి మాట్లాడటం భట్టి విక్రమార్కకు చెల్లదని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. పక్కనే ఫిరాయింపు ఎమ్మెల్యేలను కూర్చోబెట్టుకుని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రం 'ఫినిక్స్ పక్షి'లా ఎదిగిందని, కానీ కాంగ్రెస్ పాలన ఆ పక్షిని బూడిద చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్కీమ్‌ల కంటే స్కామ్‌ల మీదనే ఎక్కువ దృష్టి పెట్టిందని ఆరోపించారు. మేడారం జాతర టెండర్లలో అవినీతి జరిగిందని స్వయంగా మంత్రి కుమార్తె చెప్పడమే ఇందుకు నిదర్శనమని గుర్తు చేశారు.

# రూ.3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి**



ఆపద సమయంలో అండగా నిలిచే ఈ నిర్ణయం వల్ల ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండుతాయి. ప్రజల సంక్షేమమే పరమావధిగా సాగుతున్న ఈ పాలనలో ఇదొక కీలక మైలురాయిగా నిలిచిపోనుంది. విద్యా రంగం విషయంలో ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు నేటి తరం విద్యార్థులకు సరికొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం అభినందనీయం. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలందరికీ పౌష్టికాహారంతో కూడిన అల్పాహారాన్ని అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థుల శారీరక దృఢత్వం గురించి ఆలోచించడం శుభపరిణామం. యంగ్ ఇండియా స్కూళ్ల స్థాపన కోసం కేటాయించిన ఐదు వేల కోట్ల రూపాయలు రాష్ట్ర విద్యా వ్యవస్థ రూపురేఖలను మార్చివేస్తాయనడంలో సందేహం లేదు. సాంకేతిక విద్యను నమ్ముకున్న విద్యార్థులకు కూడా ఈ బడ్జెట్ తీపి కబురు అందించింది. ఐటీఐ, ఏటీసీ సెంటర్లలో చదువుకుంటున్న విద్యార్థులకు నెలకు రెండు వేల రూపాయల చొప్పున ఉపకారవేతనం అందించాలని నిర్ణయించడం వారి ఆర్థిక ఇబ్బందులను కొంతవరకు తగ్గిస్తుంది. ఇది నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, యువతను ఉపాధి దిశగా ప్రోత్సహించే చర్యగా కనిపిస్తోంది. అలాగే విద్యా రంగానికి మొత్తంగా ఇరవై ఆరు వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తును నిర్మించే జ్ఞాన గనులపై ప్రభుత్వం పెట్టుబడి పెడుతోందని అర్థమవుతోంది. ఇది రేపటి తరాన్ని గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దే ప్రయత్నం. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం చూపిన చొరవ ప్రశంసనీయం. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని ఈ బడ్జెట్‌లో ప్రకటించారు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు జారీ చేయడం ద్వారా వైద్య ఖర్చుల భారం నుంచి వారికి విముక్తి కలగనుంది. ఇది ప్రభుత్వ యంత్రాంగంలో పని చేస్తున్న వారికి మానసిక ధైర్యాన్ని ఇస్తుంది. వైద్య, ఆరోగ్య శాఖకు దాదాపు పదమూడు వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రంలో వైద్య మౌలిక సదుపాయాలు మెరుగుపడి, సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి చికిత్స అందే అవకాశం కలుగుతుంది. రైతు సంక్షేమంపై ప్రభుత్వం తనకున్న మక్కువను మరోసారి చాటుకుంది. వ్యవసాయ రంగానికి ఇరవై మూడు వేల కోట్ల రూపాయలకు పైగా నిధులను కేటాయించి, రైతు భరోసా పథకం కింద పద్దెనిమిది వేల కోట్ల రూపాయలను కేటాయించడం రైతు పక్షపాత వైఖరిని స్పష్టం చేస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ రూపంలో మరో మూడున్నర వేల కోట్లు కేటాయించడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరపై నమ్మకం కలుగుతుంది. వ్యవసాయం దండగ కాదు పండుగ అనే నినాదాన్ని ఈ కేటాయింపులు నిజం చేస్తున్నాయి. భూమిని నమ్ముకున్న రైతుకు ఈ బడ్జెట్ ఒక భరోసా పత్రంలా కనిపిస్తోంది. రాష్ట్రంలోని వివిధ వర్గాల సంక్షేమం కోసం బడ్జెట్‌లో సమతుల్యతను పాటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమం కోసం వేల కోట్ల రూపాయలను కేటాయించడం ద్వారా సామాజిక సమతుల్యతను కాపాడారు. ముఖ్యంగా బీసీ సంక్షేమానికి పన్నెండు వేల కోట్లు, ఎస్సీ సంక్షేమానికి పదకొండు వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడం ఆయా వర్గాల ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడుతుంది. కళ్యాణ లక్ష్మి పథకానికి మూడున్నర వేల కోట్లు, వివిధ ఉపకార వేతనాలకు నాలుగు వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడం ద్వారా సమాజంలోని అట్టడుగు వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇవన్నీ రాష్ట్రంలో సామాజిక విప్లవానికి నాంది పలుకుతాయి. మహిళా సాధికారత దిశగా 'మహాలక్ష్మి' పథకాలు అద్భుతమైన ఊతాన్ని ఇస్తున్నాయి. మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ పథకాలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. మహాలక్ష్మి పథకానికి నాలుగు వేల కోట్లు, గ్యాస్ సబ్సిడీ కోసం ఏడు వందల కోట్లకు పైగా కేటాయించడం మహిళల ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. అలాగే మహిళా, శిశు సంక్షేమ శాఖకు ప్రత్యేకంగా మూడు వేల కోట్లకు పైగా కేటాయించడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం, భద్రతపై ప్రభుత్వం గట్టి హామీని ఇచ్చింది. ఇది రాష్ట్రంలో మహిళా శక్తిని మరింత బలోపేతం చేస్తుంది.

పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో హైదరాబాద్ నగరానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం పదిహేను వందల కోట్లు, మెట్రో రైలు రెండో దశ విస్తరణకు ఆరు వందల కోట్లు కేటాయించడం ద్వారా విశ్వనగరం వైపు అడుగులు వేగవంతం చేశారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీకి వెయ్యి కోట్ల రూపాయల భారీ నిధులు కేటాయించడం విద్యా చరిత్రలో ఒక చారిత్రాత్మక నిర్ణయం. చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆధునిక హంగులతో నగరాన్ని తీర్చిదిద్దే ప్రయత్నం ఈ బడ్జెట్‌లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. పర్యాటక రంగానికి కూడా వెయ్యి కోట్లకు పైగా నిధులు కేటాయించడం వల్ల రాష్ట్రానికి ఆదాయ వనరులు పెరుగుతాయి. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ఏకంగా యాభై వేల కోట్ల రూపాయలకు పైగా కేటాయించడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు లేని పేదలకు నీడ కల్పించేందుకు ఐదున్నర వేల కోట్లు, గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ కోసం రెండు వేల కోట్లకు పైగా నిధులు కేటాయించారు. చేయూత పథకం కింద పెన్షన్ల కోసం పద్నాలుగు వేల కోట్ల రూపాయలను సిద్ధం చేయడం ద్వారా వృద్ధులు, వితంతువుల జీవితాల్లో స్థిరత్వాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ హామీల అమలు వల్ల ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు చేరుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

## పేద విద్యార్థినికి చేయూత

**ములుగు:**



ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సహాయం చేయడం గొప్ప సేవ అని మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి అన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శుక్రవారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఒక పేద విద్యార్థినికి సైకిల్‌తో పాటు 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఇతర విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి విద్యాపట్ల ప్రోత్సాహం కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయుడు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రముఖులు సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ఉపాధ్యాయుడు సతీష్‌ను శాలువాతో సత్కరించగా, అనంతరం రేగ కళ్యాణిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిటమట రఘు, గికురు భాగ్య, రామన్నగూడెం సర్పంచ్, యూత్ నాయకులు గద్దల నవీన్, గంపల శివకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రంపై ఇరాన్ దాడి

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే ప్రపంచం మరో పెను యుద్ధం ముంగిట నిలబడినట్లు కనిపిస్తోంది. ఇరాన్ , ఇజ్రాయెల్ మధ్య దశాబ్దాలుగా సాగుతున్న నీడ యుద్ధం ఇప్పుడు బహిరంగ ఘర్షణగా మారి గల్ఫ్ దేశాలన్నింటినీ తన సెగతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒకప్పుడు కేవలం ప్రకటనలకే పరిమితమైన ఈ రెండు దేశాలు, ఇప్పుడు డ్రోన్ దాడులు, క్షిపణి ప్రయోగాలు, వైమానిక దాడులతో ఒకరినొకరు నాశనం చేసుకునేందుకు సిద్ధపడ్డాయి. ఈ పరిణామాలు కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా, అంతర్జాతీయ చమురు సరఫరా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపేలా మారుతున్నాయి. ఇరాన్ రాజకీయాల్లో వచ్చిన అనూహ్య మార్పులు ఈ ఉద్రిక్తతలకు ప్రధాన కారణమయ్యాయి. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్ జరిపిన మెరుపు దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారన్న వార్తలు సంచలనం సృష్టించాయి. ఆయన మరణం తర్వాత మొజ్తబా ఖమేనీ నూతన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఆయన బహిరంగంగా ఎక్కడా కనిపించకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఆయన కూడా గాయపడి ఉండవచ్చని పాశ్చాత్య నిఘా వర్గాలు భావిస్తున్నాయి. అందుకే ఆయన కేవలం అధికారిక ప్రకటనల ద్వారానే తన సైన్యానికి, ప్రజలకు సందేశాలను పంపిస్తున్నారు. మొజ్తబా ఖమేనీ నుంచి వెలువడిన తాజా ప్రకటన ఇజ్రాయెల్, దాని మిత్రదేశాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌ను ఇజ్రాయెల్ హతమార్చిన నేపథ్యంలో, శత్రువుల భద్రతను నాశనం చేయడమే తమ ఏకైక లక్ష్యమని మొజ్తబా పిలుపునిచ్చారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే ఇరాన్ తన డ్రోన్ల సమూహాన్ని గల్ఫ్ దిశగా పంపింది. ముఖ్యంగా కువైట్‌లోని మినా అల్‌అహ్మదీ చమురు శుద్ధి కేంద్రంపై జరిగిన దాడులు గల్ఫ్ దేశాలను వణికించాయి. రంజాన్ పవిత్ర మాసంలో జరిగిన ఈ దాడుల వల్ల చమురు కేంద్రంలో భారీ మంటలు ఎగసిపడ్డాయి, ఇది ప్రపంచ ఇంధన మార్కెట్‌లో ఆందోళన కలిగించింది. కువైట్‌లో కేవలం చమురు కేంద్రాలే కాకుండా అమెరికాకు చెందిన సైనిక స్థావరాలు కూడా ఇరాన్ లక్ష్యంగా మారాయి. అక్కడ ఉన్న అమెరికా ఎయిర్‌బేస్‌పై ఇరాన్ డ్రోన్లు విరుచుకుపడటంతో భారీ నష్టం వాటిల్లినట్లు సమాచారం అందుతోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేస్తూ, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా, ఇజ్రాయెల్‌కు సహకరించే ప్రతి మౌలిక సదుపాయం తమ రాడార్‌లో ఉందని ప్రకటించింది. ఈ దాడుల పరంపర బహ్రెయిన్ వరకు పాకింది, అక్కడ ఒక పెద్ద గిడ్డంగి డ్రోన్ దాడికి గురై పూర్తిగా కాలిపోయింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనల్లో ప్రాణనష్టం జరగకపోయినా, ఆస్తి నష్టం మాత్రం భారీగా ఉంది. సౌదీ అరేబియా ఈ యుద్ధంలో తటస్థంగా ఉండాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, తన గగనతల రక్షణ కోసం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇరాన్ నుంచి ప్రయోగించిన నాలుగు డ్రోన్లు తమ భూభాగంలోకి ప్రవేశించగా, సౌదీ రక్షణ దళాలు వాటిని విజయవంతంగా కూల్చివేశాయి. ఇలాంటి చర్యల వల్ల గల్ఫ్ దేశాల మధ్య సమన్వయం దెబ్బతినే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ లోపే ఇజ్రాయెల్ తన ప్రతీకార దాడులను వేగవంతం చేసింది. ఇరాన్ ప్రజలు తమ సాంప్రదాయ నౌరూజ్ పండుగ జరుపుకుంటున్న సమయంలో, రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి.



# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

**విశాలభారతి, జాతీయం:**

భారతదేశంలో ఇంధన ధరల సెగ మరోసారి మొదలైంది. మధ్యతరగతి నుంచి సంపన్న వర్గాల వరకు అందరినీ ఉలిక్కిపడేలా చేస్తూ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తన ప్రీమియం పెట్రోల్ ధరలను పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఒక్కో లీటరుపై రూ.2 మేర పెరిగిన ఈ ధరలు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా ఈ పెంపు వెనుక అంతర్జాతీయ కారణాలు బలంగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్, అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు సరఫరాపై నీలినీడలు కమ్ముకునేలా చేశాయి. దీనికి తోడు లాజిస్టిక్స్, రవాణా ఖర్చులు పెరగడం కూడా కంపెనీపై భారాన్ని పెంచింది. ఈ పరిణామాలన్నీ కలిసి చివరకు వినియోగదారుడి జేబుకు చిల్లు పెట్టే పరిస్థితిని తీసుకొచ్చాయి. హైదరాబాద్ వంటి నగరాల్లో ఈ ధరల ప్రభావం ఇంకాస్త ఎక్కువగా కనిపిస్తోంది. ఇక్కడ డీలర్లు చెబుతున్న దాని ప్రకారం లీటరుకు కనిష్ఠంగా రూ.2.26 వరకు ధర పెరిగింది. అయితే ఈ ధరలు అన్ని పెట్రోల్ బంకుల్లో ఒకేలా ఉండకపోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక్కో బంకు ఉన్న ప్రాంతం, అక్కడికి చమురును చేరవేసే ట్రాన్స్‌పోర్టేషన్ ఖర్చులను బట్టి ధరల్లో ఐదు నుంచి పది పైసల వరకు తేడాలు ఉండే అవకాశం ఉంది. పెట్రోల్ బంకు యజమానులు కూడా ఈ మార్పులను గమనించి తమ బోర్డులపై కొత్త రేట్లను ప్రదర్శిస్తున్నారు. ఈ స్వల్ప వ్యత్యాసం వినియోగదారులకు పెద్దగా అనిపించకపోయినా, భారీ వాహనాలు లేదా నిత్యం ప్రయాణించే వారికి ఇది కొంత ఇబ్బందికరమైన విషయమే.

సాధారణ పెట్రోల్ వాడే సామాన్య వాహనదారులకు మాత్రం ప్రస్తుతానికి ఒక శుభవార్త ఉంది. హెచ్‌పీసీఎల్ కేవలం ప్రీమియం పెట్రోల్ ధరలనే సవరించింది తప్ప, రెగ్యులర్ పెట్రోల్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. దీనివల్ల నిత్యం ఆఫీసులకు వెళ్లే బైక్ రైడర్లు, చిన్న కార్ల యజమానులు ఊపిరి పీల్చుకుంటున్నారు. అలాగే దేశంలో చమురు నిల్వలకు ఎలాంటి కొరత లేదని, సరఫరా వ్యవస్థ పటిష్టంగా ఉందని సంస్థ భరోసా ఇచ్చింది. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని, ఇప్పటికే అదనపు సరకు రవాణా మార్గంలో ఉందని పేర్కొంటూ ప్రజల్లో ఉన్న ఆందోళనను తగ్గించే ప్రయత్నం చేసింది. డిమాండ్‌కు సరిపడా నిల్వలు ఉన్నాయని చెప్పడం ద్వారా అనవసరమైన భయాందోళనలకు చెక్ పెట్టింది.

అసలు ఈ ప్రీమియం పెట్రోల్ అంటే ఏమిటి అనే సందేహం చాలామందిలో ఉంటుంది. దీనినే టెక్నికల్ భాషలో 'హైఆక్టేన్ ఫ్యూయల్' లేదా జనరల్ భాషలో 'పవర్ పెట్రోల్' అని పిలుస్తారు. సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే ఇందులో ఇంజిన్ లోపల మంటను నియంత్రించే సామర్థ్యం ఎక్కువగా ఉంటుంది. అందుకే లగ్జరీ కార్లు, హైస్పీడ్ స్పోర్ట్స్ బైక్‌లు, అత్యాధునిక ఇంజిన్లు కలిగిన వాహనాల్లో దీనిని వాడతారు. ఇది ఇంజిన్ లైఫ్‌ను పెంచడమే కాకుండా మైలేజీని కూడా మెరుగుపరుస్తుంది. ఈ పెంపు వల్ల ప్రధానంగా ధనిక వర్గాలు, లగ్జరీ వాహన ప్రియులపైనే ప్రభావం పడుతుంది కాబట్టి, సామాన్యుల నుంచి పెద్దగా నిరసనలు వ్యక్తమవ్వడం లేదు.

పెట్రోల్ కథ ఇలా ఉంటే, డీజిల్ విషయంలో మరో పెద్ద షాక్ తగిలింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ బల్క్ డీజిల్ ధరను లీటరుకు ఏకంగా రూ.22 పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇది వినడానికి చాలా ఎక్కువ మొత్తంగా అనిపించినా, ఇది కేవలం బల్క్ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుంది. అంటే ఇప్పటివరకు రూ.87.57 గా ఉన్న లీటరు ధర ఇప్పుడు రూ.109.59 కి చేరుకుంది. రిటైల్ బంకుల్లో సామాన్యులు పోయించుకునే డీజిల్ ధరలపై ప్రస్తుతం ఈ ప్రభావం పడకపోయినా, పరోక్షంగా దీని పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. బల్క్ డీజిల్‌ను భారీగా కొనుగోలు చేసే వ్యవస్థలపై ఈ భారం గొడ్డలిపెట్టులా మారుతుంది. ముఖ్యంగా తయారీ రంగం, సిమెంట్, ఉక్కు కర్మాగారాలు ఈ బల్క్ డీజిల్‌పైనే ఆధారపడి నడుస్తాయి. భారీ యంత్రాలను నడపడానికి ఈ ఇంధనం ఎంతో అవసరం. ఇప్పుడు లీటరుకు రూ.22 పెరగడం వల్ల వారి ఉత్పత్తి వ్యయం ఊహించని రీతిలో పెరిగిపోతుంది. కంపెనీలు తమ లాభాలను కాపాడుకోవడానికి వస్తువుల ధరలను పెంచే ప్రమాదం ఉంది. దీనివల్ల అంతిమంగా సామాన్యులే నష్టపోతారు. పరిశ్రమలే కాకుండా భారతీయ రైల్వే, వివిధ రాష్ట్రాల రోడ్డు రవాణా సంస్థలు కూడా నేరుగా ఆయిల్ కంపెనీల నుంచి బల్క్ డీజిల్‌ను కొంటాయి. ఇప్పుడు వీరందరికీ ఇంధన ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.

రవాణా రంగంపై ఈ ప్రభావం పడితే దేశ ఆర్థిక వ్యవస్థలో చలనం మొదలవుతుంది. ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్లు ఇప్పటికే తమ ఛార్జీలను పెంచే యోచనలో ఉన్నారు. లారీలు, ట్రక్కుల యజమానులు రవాణా ఖర్చులను పెంచితే, నిత్యావసర వస్తువులైన పప్పులు, కూరగాయలు, ఇతర గృహోపకరణాల ధరలు ఆటోమేటిక్‌గా పెరుగుతాయి. అంటే సామాన్యుడికి పెట్రోల్ ధర పెరగకపోయినా, వంట గదిలో వస్తువుల ధరల రూపంలో ఈ భారం తప్పేలా లేదు. ఆర్థిక మాంద్యం భయాల మధ్య ఇటువంటి ధరల పెరుగుదల మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసే అవకాశం ఉంది. ప్రభుత్వాలు ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటాయో వేచి చూడాలి. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ ముడి చమురు సరఫరాలో ఆటంకాలు ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో బ్యారెల్ ధరలు స్థిరంగా లేకపోవడం చమురు సంస్థలకు పెద్ద సవాలుగా మారింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు సామాన్యులపై భారం పడకుండా మేనేజ్ చేస్తూ వస్తోంది. దేశంలో ప్రస్తుతం 60 రోజులకు సరిపడా వ్యూహాత్మక చమురు నిల్వలు ఉన్నాయని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇవి అత్యవసర పరిస్థితుల్లో దేశ అవసరాలను తీర్చడానికి ఉపయోగపడతాయి. అయితే ఈ నిల్వలు ఉన్నప్పటికీ అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల దేశీయంగా ధరలను నియంత్రించడం ఎల్లప్పుడూ సాధ్యం కాకపోవచ్చు. వచ్చే వారం నుంచి పెట్రోల్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందనే వార్తలు ఇప్పుడు అందరినీ భయాందోళనలకు గురి చేస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, చమురు కంపెనీలు లీటరుకు రూ.3 నుంచి రూ.5 వరకు ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నాయట. ఇప్పటివరకు భరించిన నష్టాలను పూడ్చుకోవడానికి ఈ పెంపు తప్పనిసరని అవి భావిస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే, వచ్చే వారం నుంచి సామాన్యుల జేబులకు చిల్లు పడటం ఖాయం. ఈ వార్త విన్నప్పటి నుంచి వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పండుగ సీజన్ వస్తున్న తరుణంలో ఈ పెంపు సామాన్య ప్రజల బడ్జెట్‌ను తలకిందులు చేయవచ్చు.



# 2014నుంచి 6వేల ఫోన్లు ట్యాప్

- గత ప్రభుత్వం వేల మంది వ్యక్తిగత స్వేచ్ఛను హరించింది
- సాంకేతిక విచారణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో దర్యాప్తు వేగవంతం
- నిబంధనలు మీరిన అధికారులపై వేటు, బాధ్యులెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు
- ప్రభాకర్ రావు స్టేట్‌మెంట్‌తో అసలు సూత్రధారులు త్వరలో బయటపడతారు
- కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందన్నది అబద్ధం, అది పాత ప్రైవేట్ కేసు
- 2014 నుండి జరిగిన ఏ వ్యవహారం పైనైనా విచారణకు నేను సిద్ధం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ ప్రకంపనలు మరోసారి పతాక స్థాయికి చేరుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా చేసిన సంచలన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. దాదాపు 6 వేల మంది ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేశారని సీఎం చేసిన ఆరోపణలు ఇప్పుడు సోషల్ మీడియా నుంచి అసెంబ్లీ కారిడార్ల వరకు చర్చనీయాంశమయ్యాయి. ఈ ఫోన్ ట్యాపింగ్ వల్ల సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ఎంతోమంది జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తూనే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకుందని, అంతా ఒక పద్ధతి ప్రకారం, న్యాయపరమైన విధివిధానాలను అనుసరిస్తూ ముందుకు వెళ్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. చాలామంది ఎందుకు ఇంకా అరెస్టులు జరగడం లేదని అడుగుతున్నారని, కానీ విచారణ పూర్తి కాకుండా, పక్కా ఆధారాలు సేకరించకుండా ఎవరిని పడితే వారిని జైల్లో వేయడం ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదని ఆయన వివరించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తొందరపడి తప్పులు చేయదలచుకోలేదని చెబుతూనే, విచారణ క్రమంలో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి గట్టిగా నొక్కి చెప్పారు. ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా సానుకూల స్పందన వచ్చిందని, సాంకేతికపరమైన విచారణకు కేంద్రం ఇప్పుడే అనుమతి ఇచ్చిందని రేవంత్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ వంటి సున్నితమైన అంశాల్లో కేంద్ర సంస్థల సహకారం చాలా అవసరమని, అది లభించడంతో విచారణ వేగం పుంజుకుందని ఆయన అన్నారు. ఇప్పటికే సీనియర్ అధికారి అరవింద్ కుమార్‌ను సస్పెండ్ చేశామని, నిబంధనలను అతిక్రమించి వ్యవహరించిన అధికారులందరూ శిక్ష అనుభవించాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం నేరమని ఆయన వ్యాఖ్యానించారు.

ముఖ్యంగా ప్రభాకర్ రావు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసే ప్రక్రియ కొనసాగుతోందని సీఎం తెలిపారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారులు ఎవరో, ఎవరి ఆదేశాల మేరకు ఈ ట్యాపింగ్ జరిగిందో త్వరలోనే పూర్తి వివరాలు బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో కొందరు కీలక వ్యక్తులు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత ప్రైవసీని కాలరాశారని, దీనివల్ల వ్యాపారవేత్తలు, రాజకీయ నేతలు తీవ్రంగా నష్టపోయారని ఆయన వివరించారు. వాస్తవాలు వెలుగులోకి రావడానికి కొంత సమయం పడుతుందని, కానీ ఫలితం మాత్రం కచ్చితంగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

అయితే మాజీ మంత్రి హరీష్ రావు చేస్తున్న ప్రచారాన్ని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టు తమకు క్లీన్ చిట్ ఇచ్చిందని హరీష్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. వాస్తవానికి అది పంజాగుట్టకు సంబంధించిన ఒక ప్రైవేట్ కేసు అని, దానికీ ప్రధాన ఫోన్ ట్యాపింగ్ విచారణకూ సంబంధం లేదని రేవంత్ క్లారిటీ ఇచ్చారు. అబద్ధాలతో ప్రజలను మోసం చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని, కానీ నిజాలు దాస్తే దాగవని ఆయన ఎద్దేవా చేశారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతటి తీవ్రమైనదంటే, అవసరమైతే ముఖ్యమంత్రి హోదాలో ఉన్న తనను కూడా విచారణకు పిలిచినా తాను హాజరవుతానని రేవంత్ రెడ్డి ప్రకటించడం గమనార్హం. విచారణ సంస్థల ముందు హాజరై వాస్తవాలు చెప్పడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, చట్టం ముందు అందరూ సమానమేనని ఆయన నిరూపించారు. రాజకీయ కక్షసాధింపులు తమ ప్రభుత్వ ఉద్దేశం కాదని, కేవలం అక్రమాలకు పాల్పడిన వారికి బుద్ధి చెప్పడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. ఈ ప్రకటనతో విచారణ పారదర్శకంగా సాగుతుందనే సంకేతాలను రేవంత్ రెడ్డి ప్రజల్లోకి పంపారు.

కేవలం ఫోన్ ట్యాపింగ్ మాత్రమే కాకుండా, గత పదేళ్ల పాలనలో జరిగిన ప్రతి అంశంపై విచారణకు తాను సిద్ధమని ముఖ్యమంత్రి సవాల్ విసిరారు. 2014 జూన్ 2 నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు జరిగిన ఏ వ్యవహారం పైన అయినా హరీష్ రావు లేదా కేటీఆర్ విచారణ కోరితే దానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన నిర్ణయాలు, ప్రాజెక్టుల కేటాయింపులు, నిధుల వినియోగంపై పూర్తి స్థాయి విచారణ జరిపించేందుకు తమకు ఎలాంటి భయం లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పారదర్శకమైన పాలన అందిస్తున్న తమకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ముఖ్యంగా కేటీఆర్, హరీష్ రావు తరచుగా ప్రస్తావించే హిల్ట్ పాలసీ, టీడీఆర్ అంశాలపై కూడా రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఈ పాలసీల విషయంలో ప్రతిపక్ష నేతలు ఏ విచారణ చేపట్టమంటే ఆ విచారణ జరిపిస్తామని ఆయన ఓపెన్ ఛాలెంజ్ చేశారు. అందులో ఏవైనా అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులను బోనులో నిలబెడతామన్నారు. అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వం చేసిన కొన్ని పనులు రాష్ట్ర ఖజానాకు గండి కొట్టాయని, వాటి అసలు రంగు బయటపెట్టాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని, అవినీతి రహిత తెలంగాణను నిర్మించడమే తన కలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది కేవలం ఒక టెక్నికల్ ఇష్యూ మాత్రమే కాదని, అది ఒక వ్యక్తిగత స్వేచ్ఛపై జరిగిన దాడి అని ఆయన అభివర్ణించారు. ఇలాంటి సంస్కృతిని అరికట్టకపోతే భవిష్యత్తులో ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఈ కేసును ఒక ఉదాహరణగా నిలబెట్టాలని ప్రభుత్వం భావిస్తోందని, తద్వారా రాబోయే కాలంలో ఏ అధికార యంత్రాంగం కూడా ఇటువంటి తప్పులు చేయడానికి సాహసించదని రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు కేవలం ప్రజల దృష్టిని మళ్లించడానికేనని రేవంత్ కొట్టిపారేశారు. పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడమే కాకుండా, ఇప్పుడు విచారణను ఎదుర్కోలేక అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, సరైన సమయంలో వారికి బుద్ధి చెబుతారని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఎంత ప్రయత్నించినా, నిజాయితీతో కూడిన తమ ప్రయాణాన్ని ఎవరూ ఆపలేరని ఆయన స్పష్టమైన సందేశాన్ని రాజకీయ వర్గాలకు పంపారు.

# ఇరాన్ సైనికాధికారి హతం

**విశాలభారతి, అంతర్జాతీయం:**



మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింతగా ముదురుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య సాగుతున్న ఈ భీకర పోరులో పరిణామాలు గంటగంటకూ మారుతున్నాయి. తాజాగా ఇరాన్ మరో కోలుకోలేని దెబ్బను చవిచూసింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కీలక నేత, ఆ సంస్థ అధికార ప్రతినిధి జనరల్ అలీ మహమ్మద్ నయినీ ఇజ్రాయెల్ జరిపిన మెరుపు దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. అమెరికా, ఇజ్రాయెల్‌ను హెచ్చరిస్తూ ఆయన మాట్లాడిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ సంఘటన జరగడం అంతర్జాతీయంగా పెను సంచలనంగా మారింది. ఈ వార్తను స్వయంగా ఐఆర్‌జీసీ ధ్రువీకరించడంతో ఇరాన్ రక్షణ వ్యవస్థలో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. ప్రస్తుతం జరుగుతున్న ఈ యుద్ధంలో ఇరాన్ తన అగ్రశ్రేణి కమాండర్లను ఒకరి తర్వాత ఒకరిని కోల్పోతుండటం ఆ దేశానికి పెద్ద మైనస్‌గా మారుతోంది. నయినీ కేవలం ఒక అధికారి మాత్రమే కాదు, ఇరాన్ సైనిక వ్యూహాలను ప్రపంచానికి వివరించే బలమైన గొంతుక. ఇజ్రాయెల్ గూఢచారి సంస్థలు ఇరాన్ అంతర్గత భద్రతా వలయాలను ఎంత సులువుగా ఛేదిస్తున్నాయో ఈ దాడి మరోసారి నిరూపించింది. శత్రువును హెచ్చరించిన నోటితోనే మరణవార్త వినాల్సి రావడం ఇరాన్ సైనిక చరిత్రలో ఒక విషాదకరమైన మలుపుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం ఇరాన్ సైనిక స్థైర్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నయినీ మరణించడానికి కేవలం కొన్ని గంటల ముందే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై ఆయన నిప్పులు చెరిగారు. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యంపై నెతన్యాహు చేసిన వ్యాఖ్యలకు నయినీ గట్టిగా కౌంటర్ ఇచ్చారు. ఇరాన్ వద్ద యురేనియం శుద్ధి చేసే శక్తి గానీ, బాలిస్టిక్ క్షిపణులు తయారు చేసే సాంకేతికత గానీ ఇకపై లేవని నెతన్యాహు చేసిన ప్రకటనను ఆయన కొట్టిపారేశారు. ఈ క్రమంలో ఇరాన్ రక్షణ రంగం ఎంత బలంగా ఉందో వివరిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నెతన్యాహుకు సవాలు విసిరిన కొద్దిసేపటికే ఆయన మరణించడం యాదృచ్ఛికమా లేక పక్కా స్కెచ్ అనేది చర్చనీయాంశమైంది. నయినీ తన చివరి ప్రసంగంలో ఇరాన్ క్షిపణి పరిశ్రమ గురించి అత్యంత ఆత్మవిశ్వాసంతో మాట్లాడారు. అమెరికా, ఇజ్రాయెల్‌లతో యుద్ధం జరుగుతున్నప్పటికీ తమ దేశపు ఆయుధ ఉత్పత్తి ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు. తమ క్షిపణి సాంకేతికత ఇప్పుడు అత్యున్నత స్థాయికి చేరుకుందని, యుద్ధం మధ్యలో కూడా ఉత్పత్తిని నిరాటంకంగా కొనసాగిస్తున్నామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. క్షిపణుల నిల్వల విషయంలో తమకు ఎలాంటి ఆందోళన లేదని, శత్రువులకు రాబోయే రోజుల్లో ఊహించని సర్‌ప్రైజ్‌లు ఎదురవుతాయని ఆయన హెచ్చరించారు. ఈ హెచ్చరికల వెనుక ఇరాన్ ఏదో పెద్ద ప్లాన్ చేస్తోందన్న అనుమానాలు ఇప్పుడు బలపడుతున్నాయి. యుద్ధం కొనసాగే కొద్దీ తమ దాడులు మరింత తీవ్రం అవుతాయని, శత్రువు కోలుకోలేని విధంగా దెబ్బతీస్తామని నయినీ గతంలోనే చెప్పారు. అయితే ఇజ్రాయెల్ వైమానిక దాడులు ఆయన ఆశయాలను అడ్డుకున్నాయి. ఇరాన్ వద్ద ఉన్న ఆయుధ సంపత్తి గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇటు అమెరికాను కూడా ఆలోచనలో పడేశాయి. పశ్చిమ దేశాల ఆంక్షలు ఎన్ని ఉన్నా, ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంటూనే ఉందన్నది ఆయన మాటల సారాంశం. కానీ, ఈ అగ్రశ్రేణి కమాండర్ల వరుస మరణాలు ఇరాన్ వ్యూహకర్తలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి నయినీ చెప్పినంత సాఫీగా లేదని ఈ దాడులు సూచిస్తున్నాయి.

కేవలం నెతన్యాహునే కాకుండా, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనలపై కూడా నయినీ మండిపడ్డారు. ఇరాన్ నౌకాదళం పూర్తిగా ధ్వంసం అయిందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఇరాన్ సముద్ర జలాల్లో తమ ఆధిపత్యం ఇంకా బలంగానే ఉందని నిరూపించడానికి ఆయన ప్రయత్నించారు. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో తమ సైన్యం సర్వసన్నద్ధంగా ఉందని, దమ్ముంటే అమెరికా తన యుద్ధ నౌకలను అక్కడికి పంపాలని ఆయన బహిరంగంగానే సవాలు విసిరారు. ఒక రకంగా అమెరికా అగ్రరాజ్య గర్వాన్ని ఆయన నేరుగా సవాలు చేశారు. ఆ తెగువే ఆయనను ఇజ్రాయెల్ హిట్ లిస్టులో ముందు వరుసలో నిలబెట్టింది.

పర్షియన్ గల్ఫ్‌లో తమ పట్టు జారిపోలేదని ప్రపంచానికి చాటి చెప్పాలని నయిని భావించారు. అమెరికా నౌకలు అక్కడికి వస్తే ఏమవుతుందో చూడాలని ఆయన చేసిన వ్యాఖ్యలు యుద్ధ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి. అయితే ఈ సవాళ్లు విసిరిన కొద్ది సేపటికే ఆయన ప్రాణాలు కోల్పోవడంతో ఇరాన్ నౌకాదళం, క్షిపణి విభాగాల్లో గందరగోళం నెలకొంది. ఇరాన్ అత్యంత నమ్మకమైన, చురుకైన సైనికాధికారిని కోల్పోవడం వల్ల ఆ దేశ రక్షణ వ్యూహాల్లో మార్పులు వచ్చే అవకాశం ఉంది. ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ ఎంత పక్కాగా పని చేస్తోందో ఈ వరుస దాడులే నిదర్శనం.

ఈ వారం ఇరాన్‌కు నిజంగానే ఒక పీడకలలా మారింది. నయినీ కంటే ముందే ఆ దేశపు అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీని ఇజ్రాయెల్ దాడుల్లో కోల్పోయింది. లారిజానీ మరణం నుంచి కోలుకోకముందే ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సాల్మనీ కూడా ప్రాణాలు వదిలారు. ఇలా వరుసగా ముగ్గురు కీలక నేతలు వారంలోనే మరణించడం ఇరాన్ పాలకులకు పెద్ద షాక్. ఇరాన్ రక్షణ కవచం ఒక్కొక్కటిగా విచ్ఛిన్నం అవుతున్నట్లు కనిపిస్తోంది. ఈ నష్టం కేవలం వ్యక్తుల మరణం మాత్రమే కాదు, ఇరాన్ దశాబ్దాలుగా నిర్మించుకున్న సైనిక వ్యవస్థకు తగిలిన అతిపెద్ద దెబ్బ.

నయినీ, లారిజానీ, సాల్మనీ.. ఈ ముగ్గురూ ఇరాన్ సైనిక కార్యకలాపాల్లో అత్యంత కీలక పాత్ర పోషించిన వారు. వీరి మరణంతో ఇరాన్ తన ప్రాక్సీ యుద్ధ తంత్రాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్తుందన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇజ్రాయెల్ ఒక్కో టార్గెట్‌ను ఎంచుకుని మరీ పూర్తి చేస్తోంది. ముఖ్యంగా ఇరాన్ లోపలికి చొరబడి దాడులు చేయడం లేదా ఇతర దేశాల్లో ఉన్న వారి కీలక స్థావరాలను ధ్వంసం చేయడం ఇజ్రాయెల్ స్టైల్. ఈ క్రమంలో ఇరాన్ ఎదురుదాడి చేయడానికి ప్రయత్నిస్తున్నా, ఇజ్రాయెల్ తన గూఢచారి వ్యవస్థతో ముందుగానే పసిగడుతోంది. నయినీ మరణం తర్వాత ఇరాన్ ప్రతీకారేచ్ఛ మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ దాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో మరో భారీ యుద్ధం తప్పదనే సంకేతాలు అందుతున్నాయి. ఇరాన్ తన అగ్రనేతల మరణాలకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇప్పటికే ప్రకటించింది. కానీ ఇజ్రాయెల్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ చేస్తున్న ఈ దాడులు ఇరాన్ ఉనికికే ప్రమాదకరంగా మారాయి. నయినీ హెచ్చరించినట్లు 'సర్‌ప్రైజ్‌లు' ఏమైనా ఉన్నాయా లేదా అనేది కాలమే నిర్ణయించాలి. కానీ ప్రస్తుతానికి మాత్రం ఇరాన్ రక్షణ విభాగం తీవ్రమైన ఒత్తిడిలో ఉంది. తమ సొంత గడ్డపై భద్రతను ఎలా కాపాడుకోవాలన్నది వారికి పెద్ద సవాలుగా మారింది.

# మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలి

**హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్..**



**విశాలభారతి హనుమకొండ:** : జిల్లాలో మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ పథకాలు, కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి, వివిధ కార్యక్రమాల అమలు తీరుపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, అక్షయ పాత్ర భోజనం, పోషణ్ అభియాన్, పౌష్టిక ఆహారం,భేటీ బచావో, భేటీ పడావో, అభివృద్ధి పనులు, తదితర అంశాలను ఇన్ ఛార్జి జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, ఆయా విభాగాల అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ పోషణ లోపం ఉన్న సామ్, మామ్ చిన్నారుల పట్ల ఆరోగ్యవంతంగా, బరువు పెరిగేవిధంగా మహిళా శిశు సంక్షేమ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల భవనాలు బాగాలేకపోతే స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోకి మార్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాలలకు సంబంధించి ఫిర్యాదుల కోసం ఉన్న చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిలుపుదల, నిర్మూలనపై ఈ నెల 26 న పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బాలల పరిరక్షణ విభాగం అధికారులు హాజరై బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన కల్పించాలని సూచించారు. దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో సీడీపీవోలు స్వరూప, ఉమా, ఎక్స్టెన్షన్ ఆఫీసర్ సింధురాణి, ఇంచార్జి డీసీపీవో ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్ వో రవికృష్ణ, సఖీ కేంద్రం అడ్మిన్ హైమావతి, శిశు గృహ మేనేజర్ మాధవి, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, డీహెచ్ డబ్ల్యూ కో ఆర్డినేటర్ కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలకు పాడె కట్టారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టాల్సింది పోయి, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన వరుస బడ్జెట్లతో రాష్ట్రాన్ని మరింత భ్రష్టు పట్టించడంలో హ్యాట్రిక్ కొట్టిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాంగ్రెస్ మూడో బడ్జెట్‌పై స్పందించిన ఆయన, ఇది కేవలం అంకెల గారడీ అని, ప్రజలను మభ్యపెట్టే ప్రగల్భాల మూట అని కొట్టిపారేశారు. ఆదాయ మార్గాలను అన్వేషించడంలో విఫలమైన ప్రభుత్వం, కేవలం కొత్త అప్పుల కోసం అర్రులు చాచే విధంగా ఈ బడ్జెట్‌ను రూపొందించిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టి, అప్పులతో కాలం వెళ్లదీయాలని చూడటం పాలకుల అసమర్థతకు నిదర్శనమని ఆయన విమర్శించారు. రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్, క్షేత్రస్థాయిలో అన్నదాతలను నిలువునా ముంచుతోందని బండి సంజయ్ ఆరోపించారు. రైతు భరోసా నిధులను ఇప్పటికే రెండు విడతలుగా ఎగ్గొట్టిన ప్రభుత్వం, ఈ బడ్జెట్‌లో కూడా వారిని ఆదుకునే దిశగా స్పష్టమైన కేటాయింపులు చేయలేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న హామీలు గాలిలో కలిసిపోయాయని, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం అందకపోవడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యం ఈ బడ్జెట్‌తో మరోసారి బయటపడిందని సంజయ్ విమర్శించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలంటే కనీసం 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ స్పష్టమైన ప్రతిపాదనలు చేసినప్పటికీ, ప్రభుత్వం కేవలం 8 శాతంతోనే సరిపెట్టడం దారుణమని అన్నారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దే విద్యపై పెట్టుబడి పెట్టడానికి మనసు రాని ప్రభుత్వం, అనవసరపు ఖర్చులకు మాత్రం వెనుకాడటం లేదని మండిపడ్డారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, కేవలం కాగితాల మీద అంకెలు చూపిస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యం విషయంలో కూడా పేద ప్రజలకు మొండిచేయే ఎదురైందని, ఆరోగ్యశ్రీ పథకం కేటాయింపులు చూస్తుంటే నవ్వొస్తోందని బండి సంజయ్ అన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన నిధుల కంటే, పాత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని, అలాంటప్పుడు కొత్తగా ప్రజలకు వైద్య సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లింపులు జరగక పేదలకు వైద్యం అందడం లేదని, సర్కార్ దవాఖానాల పరిస్థితి కూడా దయనీయంగా మారిందని విమర్శించారు. ఆరోగ్య రంగంపై కనీస శ్రద్ధ చూపని ఈ ప్రభుత్వం, సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని ఆయన చురక అంటించారు. ఆధ్యాత్మికతను, సనాతన ధర్మాన్ని గౌరవించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందని బండి సంజయ్ మండిపడ్డారు. గత బడ్జెట్‌లో దేవాదాయ శాఖకు కనీసం 190 కోట్ల రూపాయలు కేటాయించినా, ఈసారి ఆ ప్రస్తావన కూడా లేకపోవడం శోచనీయమన్నారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే అత్యంత పవిత్రమైన పుష్కరాల నిర్వహణకు కేటాయించిన నిధులు తూతూమంత్రంగానే ఉన్నాయని, హిందూ ధర్మం పట్ల ప్రభుత్వానికి ఉన్న వివక్షకు ఇదే నిదర్శనమని విమర్శించారు. ఆలయాల అభివృద్ధిని గాలికొదిలేసి, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన ఆరోపించారు.

రాష్ట్ర జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీల పట్ల ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని సంజయ్ ధ్వజమెత్తారు. ఇంత పెద్ద జనాభా ఉన్న వర్గానికి బడ్జెట్‌లో కేవలం 4 శాతం నిధులు కేటాయించడం విడ్డూరంగా ఉందని, ఇది బీసీలను అవమానించడమేనని అన్నారు. బీసీల అభ్యున్నతి కోసం పథకాలు లేవని, వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్న హామీలు బుట్టదాఖలయ్యాయని విమర్శించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే కాంగ్రెస్, నిధుల కేటాయింపు దగ్గరకు వచ్చేసరికి బీసీలను విస్మరించడం వారి ద్వంద్వ నీతిని బయటపెడుతోందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం తన పదవీ కాలం మరో రెండేళ్లేనని భావిస్తోందని, అందుకే ఇష్టారాజ్యంగా అప్పులు చేసేందుకు సిద్ధపడిందని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచి వెళ్లాలన్నదే కాంగ్రెస్ ఆలోచనగా కనిపిస్తోందని విమర్శించారు. ఆదాయం పెంచే మార్గాలు లేవు కానీ, అప్పుల మీద అప్పులు చేస్తూ భవిష్యత్ తరాల మీద పెను భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. బాధ్యతాయుతమైన ప్రభుత్వం చేయాల్సిన పని ఇది కాదని, కేవలం స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసమే ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల భారాన్ని కాంగ్రెస్ విమర్శించేదని, కానీ ఇప్పుడు అదే బాటలో నడుస్తూ రికార్డులు సృష్టిస్తోందని సంజయ్ ఎద్దేవా చేశారు. పాత ప్రభుత్వ అప్పుల బాగోతాన్ని బయటపెడతామని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు తన హయాంలో కూడా అవే అక్రమాలకు తెరలేపారని ఆరోపించారు. రాష్ట్ర ఖజానాను ఎవరు దోచుకున్నా వదిలే ప్రసక్తే లేదని, బీజేపీ అధికారంలోకి రాగానే గత పదేళ్ల ఆర్థిక అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ చేపడుతామని ఆయన హెచ్చరించారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన ప్రతి ఒక్కరిని చట్టం ముందు నిలబెడతామని సంజయ్ స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగాల కల్పన విషయంలో కూడా బడ్జెట్ నిరాశనే మిగిల్చిందని, నిరుద్యోగ భృతి ఊసే లేదని సంజయ్ విమర్శించారు. కొత్త నోటిఫికేషన్లు ఇవ్వకుండా, ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా యువతను వంచిస్తున్నారని మండిపడ్డారు. ఐటీ మరియు పరిశ్రమల రంగంలో కొత్త పెట్టుబడులు రాకపోగా, ఉన్న కంపెనీలు కూడా పక్క రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన ప్రభుత్వం, కేవలం రాజకీయ ప్రతీకార చర్యలకే పరిమితమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎంపీ ఈటల రాజేందర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నవజీవన్ రెడ్డి



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తెలంగాణ ఉద్యమకారులు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదిన సందర్భంగా వారి నివాసంలో నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి ఈటల రాజేందర్ ని శాలువాతో సత్కరించి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆరోగ్యం, ఆయుష్షు, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎల్.బి.నగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగా రెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకులు జంగా రెడ్డి, ఎర్ర శ్రీకాంత్, అరుణ్, బీజేవైఎం నాయకులు ఎర్ర ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## హరిఓం ఎంటర్‌ప్రైజెస్, మంగళదీప్ మార్కెటింగ్ ప్రారంభం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** తోరూర్ నుండి కోహెడ వెళ్లే ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన హరిఓం ఎంటర్‌ప్రైజెస్ & మంగళదీప్ మార్కెటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హయత్‌నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ యజమానులను అభినందిస్తూ, వారి వ్యాపారం విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో ఇలాంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎంపీ ఈటల రాజేందర్ బర్త్‌డే సెలబ్రేషన్స్‌లో కార్యకర్తల ఉత్సాహం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** ప్రజానాయకుడు, బడుగు బలహీన వర్గాల ఆశాకిరణం, పేదల పెన్నిధి, రాష్ట్ర సాధనకై నిరంతరం కృషి చేసిన ఉద్యమ నాయకుడు, తెలంగాణ తల్లి ముద్దుబిడ్డ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి , నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్, బండ్లగూడ జహంగీర్ మున్సిపాలిటీ మండలం మరియు డివిజన్ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి హాజరై ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేవుని చల్లని ఆశీస్సులు ఆయనపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందాలని, జీవితాంతం ఆనందంగా ఉండాలని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని మనసారా ఆకాంక్షించారు.

## సురంగల్‌లో ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందు



**మొయినాబాద్, విశాలభారతి:** రంజాన్ మాసం సందర్భంగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సురంగల్‌లో 14వ వార్డ్ కౌన్సిలర్ కర్రోల శ్రీధర్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఐక్యతను చాటారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్ మాట్లాడుతూ, ఇఫ్తార్ అనేది సమానత్వానికి ప్రతీక అని, మహమ్మద్ ప్రవక్త అన్ని మతాలు, కులాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ సంప్రదాయాన్ని ప్రారంభించారని తెలిపారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో గడ్డం అంజిరెడ్డి, సభ్యులు ఎండి షఫీ, ఎట్టయ్య గౌడ్, అశోక్ గౌడ్, ఎండి ఇస్మాయేల్, ఎండి మహబూబ్, సద్దాం, కర్రోల నర్సింగ్ రావు, ధనరాజ్, కన్నా, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లోనే సేవలు అందించాలి కౌన్సిలర్ కర్రోల శ్రీధర్

**గ్రామ పాలన అధికారులను గ్రామాలకు పంపించాలని వినతి**



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ కర్రోల శ్రీధర్ గ్రామ పాలన అధికారులను గ్రామాల్లోకి పంపించాలని కోరుతూ తాసిల్దార్ గౌతమ్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్ మాట్లాడుతూ, ప్రస్తుతం గ్రామ పాలన అధికారులు రెవెన్యూ కార్యాలయాల వద్దే ఉండి పనులు నిర్వహిస్తున్నారని, దీనివల్ల గ్రామాల్లోని సాధారణ ప్రజలు చిన్న చిన్న భూ సమస్యలు, కులంఆదాయం సర్టిఫికెట్లు వంటి పనుల కోసం తప్పనిసరిగా తాసిల్దార్ కార్యాలయానికి రావాల్సి వస్తోందని తెలిపారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తులకు సులభంగా సేవలు అందేలా గ్రామ పాలన అధికారులు వారానికి కనీసం మూడు రోజులు గ్రామాల్లో ఉండి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఆయన కోరారు.ఈ విషయంపై స్పందించిన తాసిల్దార్ గౌతమ్ కుమార్, పదవ తరగతి పరీక్షలు పూర్తైన వెంటనే గ్రామ పాలన అధికారులను గ్రామాల్లోకి పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిమ్మగల చంద్రశేఖర్, ఎర్రోళ్ల రామచందర్, ఎలుగని లోకేష్ గౌడ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్‌కి ఘనంగా సన్మాణం

**ఆకుల ఇంద్రసేనానికి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్**



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని లక్కారం గ్రామానికి చెందిన గుండబోయిన రవికుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్నికైన సందర్భంగా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్ర సేనారెడ్డి శుభాకాంక్షలు తెలిపి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్ర సేనారెడ్డి మాట్లాడుతూ రవికుమార్ యాదవ్ కొన్ని ఏండ్లుగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం అతని కృషి అభినందనీయం అన్నారు.కష్టపడ్డ వ్యక్తికి గుర్తింపు ఇచ్చిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాశం సంజయ్ బాబు,సీనియర్ నాయకులు లందగిరి భీమయ్య,దేశట్ల బిక్షం,రేఖ మల్లేశం,గోపనబోయిన మహేశ్ యాదవ్,7వ వార్డు ప్రధాన కార్యదర్శి పాశం శ్రీనివాస్, బొల్లమోని చంద్రయ్య,బద్రి చిన్న గాలయ్య,ఎర్ర శంకర్,పాశం యుగంధర్,కడుపు ముత్యం,యస్కె సయ్యద్,కడుపు భూపాల్,గోపనబోయిన నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా నివాసితుల ఆందోళన

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

బండ్లగూడ జాగిర్ పరిధిలోని మధు పార్క్ రెడ్డి అపార్ట్‌మెంట్ నివాసితులు తమ ఇళ్ల కూల్చివేతకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అపార్ట్‌మెంట్ ముందు మరియు ప్రధాన రహదారి పక్కన శాంతియుతంగా దీక్ష కొనసాగిస్తూ ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నివాసితులు తమకు ఎలాంటి పరిహారం అవసరం లేదని స్పష్టంగా తెలిపారు. “మాకు ఎంత డబ్బు ఇచ్చినా మా ఇళ్లు మాకు కావాలి. మేము ఎన్నో సంవత్సరాలు కష్టపడి, రూపాయి రూపాయి కూడబెట్టి ఈ ఇళ్లను నిర్మించుకున్నాం. ఇప్పుడు ఒక్కసారిగా వాటిని కూల్చివేస్తామని చెప్పడం అన్యాయం” అని వారు భావోద్వేగంతో తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు నిర్మాణానికి తమకు వ్యతిరేకత లేదని, అభివృద్ధి పనులు జరగాలని కోరుకుంటున్నామని చెప్పారు. అయితే ఆ ప్రాజెక్ట్ పేరుతో తమ ఇళ్లను కూల్చివేయడం సరైంది కాదని, ప్రత్యామ్నాయ మార్గాలను ప్రభుత్వం పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నివసిస్తూ తమ ఇళ్లతో, పరిసరాలతో తమకు గాఢమైన అనుబంధం ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి పై నివాసితులు విమర్శలు గుప్పించారు. తమ ఇళ్లను “జీరో విలువ”గా ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. ఈ సమస్యను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి సీఎం స్వయంగా ప్రాంతానికి వచ్చి తమతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఇళ్లను కూల్చివేయడానికి అధికారులు బుల్డోజర్లతో వస్తే అడ్డుకుంటామని, అవసరమైతే వాటి ముందే పడుకుంటామని నివాసితులు హెచ్చరించారు. “మా ప్రాణాలు పోయినా పరవాలేదు కానీ మా ఇళ్లను మాత్రం వదులుకోం” అని వారు స్పష్టం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసనను కొనసాగిస్తామని తెలిపారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు అభివృద్ధి ప్రాజెక్ట్ అవసరం, మరోవైపు ప్రజల నివాస హక్కులు మధ్య ఘర్షణ చోటుచేసుకోవడం గమనార్హం. ప్రభుత్వం ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందో అనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.




## ఇంద్రమ్మ ఇండ్లు ప్రారంభోత్సవం

**చౌటుప్పల్, విశాలభారతి:**



మున్సిపాలిటీ పరిధిలోని గల 17వ వార్డులో ఏనుగు మల్లమ్మ నర్సిరెడ్డి,19వ వార్డులో మలిగే లింగమ్మ,పబ్బు కవిత ల నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లలను శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రతీ పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గౌరవప్రదమైన జీవితానికి ఇందిరమ్మ ఇల్లు సోపానం అని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, చౌటుప్పల్ మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్,కౌన్సిలర్లు పల్లె లావణ్య సురేందర్ రెడ్డి,చింతల ఉమామహేశ్వరి ,పిల్లలమరి మధుసూదన్,ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్,షాది ఖానా చైర్మన్ ఎండి కరీం,డిసిసి కార్యదర్శి చింతల సాయిలు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దగొని మౌనిక గౌడ్, జవహర్ బాల్ మంచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ పెద్దగోని రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ ఉపాధ్యక్షులు మాదాని గోపాల్, కాంగ్రెస్ పార్టీ 17వ వార్డు అధ్యక్షులు ఎస్కే యూసుఫ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాదానీ రాధా,మహమ్మద్ తాజ్, కోట్ల సాయి,17, 19, వార్డు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగానికి తక్కువ కేటాయింపులపై ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళన

**ఆదిలాబాద్, విశాలభారతి:**



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి సరైన ప్రాధాన్యం లభించలేదని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. పెండింగ్ బిల్లులు, పిఆర్‌సీ, ఐదు డీఏలు ఇంకా పరిష్కారం కాకపోవడం, వాటిపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం విచారకరమని పేర్కొన్నాయి. ఇప్పటికే పిఆర్‌సీ అమలు 33 నెలలు ఆలస్యమైందని, ఆరు నెలల్లో అమలు చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోవడాన్ని విమర్శించాయి. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి రూ.1056 కోట్లు కేటాయించడాన్ని స్వాగతించినప్పటికీ, ఆ నిధులు సక్రమంగా వినియోగం కావాలని సూచించాయి. అయితే ఉచిత పథకాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల విద్యారంగానికి తగిన కేటాయింపులు జరగలేదని అభిప్రాయపడ్డాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌లో విద్య, మానవ వనరుల కోసం కేవలం రూ.26,674 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది మొత్తం బడ్జెట్‌లో 8.2 శాతమేనని వెల్లడించాయి. మేనిఫెస్టోలో విద్యకు 15 శాతం కేటాయిస్తామని ఇచ్చిన హామీ వరుసగా మూడో బడ్జెట్‌లో కూడా నెరవేరలేదని పేర్కొన్నాయి. ఉదయం అల్పాహారం, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం మంచి నిర్ణయమే అయినప్పటికీ, అదనంగా కేటాయించిన రూ.3,566 కోట్లు ఈ పథకాల అమలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ స్థాపన వంటి కార్యక్రమాలకు సరిపోకపోవచ్చని అభిప్రాయపడ్డాయి. అలాగే పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, మధ్యాహ్న భోజనం నాణ్యత పెంపు వంటి అంశాలకు అదనపు నిధుల కేటాయింపు లేకపోవడాన్ని విమర్శించాయి. గత సంవత్సరం 7.58 శాతం కేటాయించగా, ఈసారి 8.22 శాతం మాత్రమే కేటాయించడం నిరాశ కలిగించిందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొన్నాయి.

## ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా

**అందజేసిన మున్సిపాలిటీ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్**



**చౌటుప్పల్, విశాలభారతి:** రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అందిస్తున్న రంజాన్ తోఫా కిట్లు పేద కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల పావని రమేష్ గౌడ్ అన్నారు.చౌటుప్పల్ పట్టణంలోని మైనార్టీలకు రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫా కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరువవుతున్నాయని,రంజాన్ తోఫా ద్వారా ముస్లిం సోదరులకు ఆర్థికంగా ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎండి హన్ను బాయ్,షాది ఖానా చైర్మన్ ఎండి కరీం,బాబా షరీఫ్,ముస్లిం మత పెద్దలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ



**ఇఎల్వి భాస్కర్ ఫౌండేషన్**

**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రం తంగడపల్లి గ్రామంలోని ఇట్టగోని కమలమ్మ అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. వారి కుటుంబ పరిస్థితినీ ఇ ఎల్ వి భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి తోకల సాయికుమార్ చేతుల మీదుగా ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇట్టగోని చంద్రయ్య, జంగయ్య, చిన్న జంగయ్య,రమేష్, లింగస్వామి,నరసింహ,చిన్న నరసింహ,విఘ్నేష్,పల్లపు సుధాకర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## త్రో బాల్ ఛాంపియన్షిప్ పోటీలు

**ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు**




**ముషీరాబాద్, విశాలభారతి:** ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు జాతీయస్థాయి త్రో బాల్ ఛాంపియన్షిప్ పోటీలను 34వ ఫెడరేషన్ త్రో బాల్ ఛాంపియన్షిప్ ఆధ్వర్యంలో తిరుపతిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా త్రో బాల్ పోటీల్లో సిల్వర్ కప్పు గెలుచుకోవడానికి ఎమ్మెస్ వైష్ణవి, జోహాన్నవి, దీప్తి, హారిక తమ టీం సభ్యులతో ప్రతిభను కనబరిచి టీంకు సిల్వర్ కప్పు గెలుచుకోవడానికి ముఖ్యపాత్ర పోషించారు. ఈ సందర్భంగా హెడ్ కోచ్ కే సిద్దేశ్వర రెడ్డి, ప్రదీప్ రెడ్డి, శివకుమార్ యాదవ్, సాయి ప్రణీత్, తెలంగాణ సెక్రటరీ కిరణ్ చారి, త్రో బాల్ ఫౌండర్ జగన్మోహన్ గౌడ్ వారిని అభినందించారు.

## బడ్జెట్ లో విద్యా రంగానికి కేటాయింపులు ఏవి?

**జే.బీ.పీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**



**కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో విద్యా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసేలా ఉందని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ విమర్శించారు.బడ్జెట్ పై ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యా రంగానికి 15 శాతం నిధులను బడ్జెట్ లో కేటాయిస్తామని హామీ ఇచ్చి కేవలం 8.2 శాతం మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులుపుకున్నారని,ఈ అరకొర నిధులు ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోవని విమర్శించారు. 3,24,234 కోట్లతో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో వైద్య రంగానికి కేవలం 13679 కోట్లను మాత్రమే కేటాయించి పేద ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని,జాబ్ క్యాలెండర్ పై ప్రస్తావించలేదని,ఆరు గ్యారంటీ ల అమలు పై బడ్జెట్ లో ఎక్కడ ప్రస్తావన లేదని,ఉద్యోగాలకు సంబంధించిన పీఆర్సీ పై ప్రకటన లేకపోవడం దారుణమన్నారు.రాజీవ్ యువ వికాసానికి పోయిన బడ్జెట్ లో 6 వేల కోట్లు కేటాయించి 6 పైసలు కూడా ఖర్చు చేయలేదని దెప్పిపొడిచారు.ఈ బడ్జెట్ అంకెల గారడి తప్ప సామాన్య,పేద ప్రజలకు వొనగూరింది ఏమి లేదని విమర్శించారు.

## స్కూల్ ఆవరణలో పాన్ షాప్ నిర్మాణం

- **రాజశేఖర్ పై కేసు నమోదు**

**దేవరపుల విశాలభారతి:** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గారి ఆదేశాల మేరకు స్కూల్స్ మరియు కాలేజీలకు 100 మీటర్ల పరిధి లోపల పాన్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎస్సై సృజన్ కుమార్ హెచ్చరించారు. సిగరెట్లు మరియు ఇతర పొగాకు ఉత్పత్తులను మైనర్లకు విక్రయించిన కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోల్కొండ గ్రామంలోని స్కూల్ ఆవరణలో పాన్ షాప్ నిర్మాణం చేపట్టిన రాజశేఖర్ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ సృజన్ కుమార్ మాట్లాడుతూ విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు మరియు మత్తు పదార్థాల విక్రయం పూర్తిగా నిషేధమని చెప్పారు అదేవిధంగా 100 మీటర్ల దూరం దాటినా మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విగ్రహిస్తే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# ప్రభుత్వ కార్యాలయలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**కొడంగల్, విశాల భారతి :** దౌల్తాబాద్ మండలం పురోగతిలో ఉన్న సీసీ రోడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాలు మార్చ్ 25వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దిపక్ తివారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ దౌలతాబాద్ మండలంలో పర్యటించి తహసిల్దార్ కార్యాలయంలోని మరమ్మత్తు , ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రహరీ గోడ నిర్మాణ పనులను, గ్రంథాలయ నిర్వహణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని సదుపాయాలు, ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఇప్పటికే మంజూరైన సీసీ రోడ్లు, ప్రహరీ గోడలు, ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగవంతం చేయాలని, ఇప్పటికి గ్రౌండింగ్ కానీ పనులను మొదలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంటకాలను



పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన క్రమంలో ఓపి, ఇన్ పేషంట్ వార్డు, టీకాల , మందుల గదిని పరిశీలించి వైద్యం నిమిత్తం వచ్చిన పేషంట్లతో కలెక్టర్ మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 12 గంటలు ప్రజలకు సేవలు అందిస్తున్నారు అనే విషయం తెలుసుకొని 24 గంటల సేవల నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ డిఎంహెచ్ఓ కు తెలిపారు. జిల్లాలో ఆసుపత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం మంచినీటి సదుపాయానికి ఆర్.ఓ ప్లాట్లను ఏర్పాటును చేయాలని కలెక్టర్ డిఎంహెచ్ఓ కు సూచించారు. గ్రామాల్లో 100 శాతం వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న క్రమంలో 10 తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుచున్నాయి. ఈ సందర్భంగా ఇంగ్లీష్ సబ్జెక్టు పై కలెక్టర్ స్వయంగా విద్యార్థులకు విద్య పట్ల మెళుకువలను సూచించారు. విద్యార్థులందరూ బాగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, సబ్జెక్టు పరంగా ఏవైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. కలెక్టర్ తో పాటు వివిధ కార్యక్రమాల్లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఎంహెచ్ఓ స్వర్ణకుమారి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, డిఈ సుదర్శన్, హౌసింగ్ డిఈ చందర్, తహసిల్దార్ గాయత్రి, ఎంపీడీవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు

- **మా బడిలో విద్యార్థులు రంజాన్ పర్వదిన ప్రార్థనలు**
- **రంజాన్ మాసంలో మరింత భక్తిశ్రద్ధలు పటిస్తారు**
- **భిన్నత్వంలో ఏకత్వం నా భారతదేశం. సిస్టర్ సుమలత**




**బూర్గంపాడు, విశాలభారతి:** మొరంపల్లి బంజర స్టెల్లా మేరి స్కూల్ నందు రంజాన్ పర్వదిన ప్రార్థనలు విద్యార్థులు ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్.సుమలత మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం నా భారతదేశం అని వ్యాఖ్యానించారు. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు సూర్యోదయానికి ముందు తిని రోజంతా ఉపవాసం ఉంటు సూర్యాస్తమయం అయ్యాక ఉపవాసం విరమిస్తూ రంజాన్ మాసంలో మరింత భక్తిశ్రద్ధలతో ఉపవాస ప్రార్థనలు, దానధర్మాలతో నెల రోజులపాటు నియమ నిశ్టలతో రంజాన్ పర్వదినం ఉత్సాహంతో జరుపుకుంటారు అని తెలిపారు. మా బడిలో హిందూ, ముస్లిం క్రిస్టియన్ అని కులమత బేధాలు, తారతమ్యం లేకుండా ఐక్యమత్యంతో ఉంటామని పేర్కొంటూ ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా 2026 27 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలుపుటకు సంతోషిస్తున్నాం.

## రంజాన్ మాసంలో ముస్లింల పవిత్ర విధి 'ఫిత్రా దానం'

- **మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా**

**పాల్వంచ, విశాలభారతి:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రతి ముస్లిం తమ కుటుంబ సభ్యులందరి పేరుమీద పేదలకు అందించే ఒక ముఖ్యమైన దానమే ఫిత్రా అని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఫిత్రా అనగా ఉపవాసం ముగిసిన సందర్భంగా చేసే దానం అని తెలిపారు. ఈదుల్ ఫితర్ నమాజ్ ఆచరించడానికి ముందుగానే ఈ ఫిత్రా దానాన్ని తమ కుటుంబంలో ఉన్న పేద బంధువులకు, తమ వీధిలోని పేద ముస్లింలకు లేదా తమ ప్రాంతంలోని మదర్సాలకు అందజేయాలని ఆయన సూచించారు. ఫిత్రా దానానికి రెండు ప్రధాన ఉద్దేశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఉపవాసం పాటించే సమయంలో తెలిసీ తెలియక చేసిన చిన్న తప్పుల నుండి విముక్తి పొందడం. పేదలకు ఆహారం అందించి వారు కూడా ఆకలి బాధ లేకుండా ఈద్ పండుగను ఆనందంగా జరుపుకునేలా చేయడం. ఫిత్రాను "జకాత్ అల్ ఫిత్ర్" అని కూడా పిలుస్తారని ఆయన చెప్పారు. కాబట్టి ముస్లిం సోదరులు తమ ప్రాంతాల్లో కనిష్టంగా ఒక్కొక్క వ్యక్తికి రూ.120 చొప్పున, కుటుంబంలో ఉన్న ప్రతి సభ్యుడి పేరుమీద లెక్కకట్టి ఫిత్రా దానం చేయాలని సూచించారు.

## ప్రిన్సిపాల్ వీరునాయక్‌ని సస్పెండ్ చేయాల్సిందే

- **బీఈడీ కళాశాల విద్యార్థులను లైంగిక వేధింపులకు పాల్పడితే వదిలేస్తారా**
- **వేధింపులపై బహిర్గతంగా దర్యాప్తు నిర్వహించి కఠినంగా శిక్షించాల్సిందే**
- **ప్రిన్సిపాల్ మాలోత్ వీరునాయక్‌కి శిక్ష పడితేనే విద్యార్థులకు న్యాయం జరుగుద్ది**
- **సంఘాల మహిళా నేతలు డిమాండ్**



**భద్రాచలం, విశాలభారతి:**

భద్రాచలం పట్టణంలోని బిఈడి కాలేజ్ నందు గత కొంతకాలంగా అక్కడ ఉన్న గత ప్రిన్సిపాల్ వీరునాయక్ చదువుకు వచ్చిన ఆడపిల్లల పైన లైంగిక వేధింపులకు పాల్పడి తరచూ అరాచ్మెంట్ చేసేవాడని అటువంటి ప్రిన్సిపాల్ ని మందలించి గోప్యంగా వేరే కళాశాలకు పంపించడం మహిళా విద్యార్థులను అవమానపరచడమేనని ఆదివాసి సంక్షేమ పరిషత్ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు కుంజా రమదేవి. మహిళా శక్తి నాయకులు కొండ్రు సుధారాణి. మహాజన సమితి మహిళా రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి ఆవేదన వ్యక్తపరిచారు .ఈ సందర్భంగా వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ మహిళల పట్ల తరచూ వేధింపులకు పాల్పడి మహిళలను అగౌరవపరిచిన ప్రిన్సిపాల్ రాజమర్యాదలతో వేరొక చోటికి ఏ పనిష్మెంట్ లేకుండా పంపించడం సరైన విధానం కాదని సుదీర్ఘ ప్రాంతాల నుంచి చదువు కోసం వస్తున్న ఆడపిల్లల పైన లైంగిక వేధింపులకు పాల్పడి పెద్ద మనిషిగా చలామనవుతున్న ప్రిన్సిపాల్ ను మందలించి వదిలేయటం వెనుక అంతర్యం ఏమిటో ఉన్నత అధికారులు తెలపాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రిన్సిపాల్ చేసిన తప్పులకు తప్పనిసరిగా శిక్ష పడాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. బహిర్గతంగా విద్యార్థుల సమక్షంలో ఆదివాసి సంఘాల సమక్షంలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

## బడుగు బలైన వర్గాల కోసం పోరాడుతున్న ఈటెల

- **బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి**

**ముషీరాబాద్, విశాలభారతి:** గత 25 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఈటెల రాజేందర్ నిరంతరం కృషి చేస్తున్నారని బిసి కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అన్నారు. బడుగులకు విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ ఆర్థిక రంగాల్లో రాణించేందుకు తను చేస్తున్న పోరాటం మరువలేనిదని కొనియాడారు. ఎంపీ ఈటెల రాజేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం షామీర్పేట్ లోని ఎంపీ నివాసంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ అనంతోజు బ్రహ్మచారి, నరసింహ చారి, తాటికొండ శ్రీనివాస్ చారి, నరసింహ చారి, సాయి, సురేష్, రాజ్యలక్ష్మి, ఉపేందర్ రెడ్డి, శర్మలతో గణేష్ చారి వెళ్లి ఈటెల రాజేందర్ ను శాలువతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పి కేక్ కట్ చేయించారు. అనంతరం గణేష్ చారి మాట్లాడుతూ ఈటెల రాజేందర్ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు హాస్టల్ విద్యార్థులకు సన్న బియ్యంతో అన్నం పెట్టించాడని గుర్తించారు.

# గులాబీ జౌరంగజేబు
# గుట్టు తెలంగాణకెరుకా!

తెలంగాణ ప్రాంతాన్ని, నేలను ఎంతోమంది పాలకులు పాలించారు. శాలీవాహనులు, శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అజఫ్‌జాహిలు... ఆ తర్వాత ప్రజాస్వామ్య ఉద్యమ ప్రభావాల నేపథ్యంలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ ఏరియా అంతా ఉమ్మడి రాష్ట్రంలో కలిసింది. వెరసి విధ్వంసం, నిలువెత్తు నిర్లక్ష్యానికి గురయ్యాం. విధ్వంసం, నిర్లక్ష్యంపై యావత్ తెలంగాణ సమాజం గాండ్రించింది. గడ్డిపోచలు, గడ్డపారలై గర్జించాయి. వేల మంది విద్యార్థులు, ఉద్యమకారుల బలిదానాల నేపథ్యంలో తల్లి సోనియమ్మ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది. కాగా, ఈ ఉద్యమ ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు గత పదేండ్లు ఒక్కటే కుటుంబానికి పరిమితం అయ్యాయి. ఆ గడీలపై గర్జించిన మన ప్రజా నాయకుడు రేవంత్ రెడ్డి, యావత్ తెలంగాణను రాజకీయంగా ఏకం చేయగలిగారు. దీంతో గడీల పాలకులు తోక ముడిచారు. విచిత్రం ఏమిటంటే.. ఓడిపోయాక జనంలోకి వచ్చి.. తాము చేసిన తప్పులు, తప్పిదాలు ఏంటో విశ్లేషించుకుంటున్నారా అంటే... ప్రజలే తప్పు చేశారన్నట్టు వారంతా మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉంది. ఫాంహౌసుల పాలనకు చరమగీతం పాడినా... చింతమడక చిచ్చుకు.. ఆయన పుత్రరత్నం, అల్లుడు, చెట్ల సంతోషుకు ఇంకా తెలిసి రాకపోవడం శోచనీయం. ఇదే అదునుగా భావించిన ఆయన అల్లుడు ప్రతిపక్ష పార్టీని తన గ్రిప్‌లోకి తీసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మరి ఆయన కొడుకు... ప్రాసల పద బంధాలు, రిథమిక్ మాటలనే తారకమంత్రాలుగా ఒక పొలిటికల్ కంటెంట్ క్రియేటర్ మాదిరిగా రాజకీయాలు చేస్తుండటం ఈ దశాబ్దపు విషాదం.

కాగా, గతంలో రాజ్యాలు ఉండేవి. వాటికి రాజులు ఉండేవారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం కారణంగా... రాజులు పోయినా, రాజ్యాలు పోయినా... రాచరిక పోకడలు మాత్రం పోలేదు. పూర్వం ఒకరి నుంచి ఒకరికి రాజ్యాధికారం మార్పిడి జరిగినప్పుడు యుద్ధాలలో ఎంతో హింస జరిగేది. కానీ ఇప్పుడు ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకులను ఎన్నుకుంటున్నా... కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. ప్రజలే తప్పు చేశారని అనుకుంటున్నారు. నియంత పోకడలను అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. శాసనసభ ఆవరణలో తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్న సందర్భంలో కొత్త గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గారికి శుభాకాంక్షలు తెలిపేందుకైనా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వస్తారని రాష్ట్ర ప్రజలు ఎదురు చూశారు. కానీ ఆయన ఇంకా ప్రజలే తప్పు చేశారని అనుకుంటూ.. ఆ మేరకు ఓ కాకి లెక్కలు వేసుకూంటూ అహంకార ధోరణితో వ్యవహరించడం సహేతుకం కాదు. 76 ఏండ్ల స్వతంత్ర భారత దేశంలో ప్రభుత్వాలు మారినా ఇలా సంప్రదాయాలను ఉల్లంఘించలేదు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి ప్రదర్శించడం, ప్రజలు బుద్ధిచెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా ఇప్పుడూ అదే తీరుగా ప్రవర్తించడం గమనార్హం.



మన దేశంలోని ఏదైనా ఒక రాష్ట్రంలో బడ్జెట్ సమావేశాల ముందు రెండు చట్టసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడం రాజ్యాంగబద్ధ ప్రక్రియ. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పార్లమెంటరీ సాంప్రదాయాలను అనుసరించి ఈ పద్ధతి, ప్రక్రియ కొనసాగుతున్నది. ప్రజాస్వామ్యంలో అది సభా సంప్రదాయం. కొత్తగా రాష్ట్రానికి వచ్చిన గవర్నర్ గారు అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తే... ఉభయ సభల సంయుక్త సమావేశానికి వస్తే... మర్యాదగా గవర్నర్ ను కలిసి, ఆహ్వానించాల్సిన ప్రధాన ప్రతిపక్ష నేత కనీసం సభకు కూడా రాకపోవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గతంలో వారి ప్రభుత్వం ఉండగా ఒక బీసీ ఆడబిడ్డ, మహిళ గవర్నర్ గా తమిళిసై ఉన్నప్పుడు ఆమెను ఏ విధంగా అవమానించారో యావత్ తెలంగాణ, మొత్తం దేశమంతా కండ్లారా చూసింది. రెండు సంవత్సరాల పాటు ఆమెను గవర్నర్ గా తెలంగాణ శాసనసభకు రాకుండా అడ్డుకున్నారు. చివరకు హైకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. గవర్నర్ గారిని అవమానించిన దుర్మార్గపు ప్రవర్తనలో ఇప్పటికీ మార్పు రాలేదు.

రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ విజన్ ను రెండు భాగాలుగా వర్గీకరించి సర్కారు ముందుకు వెళుతుంది. 2034 నాటికి ప్రభుత్వ లక్ష్యం ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడం. 2047 అంటే... స్వతంత్ర భారతదేశం నూరు వసంతాల మైలురాయికి చేరే సమయానికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ రాష్ట్రం ఎదగడం మన లక్ష్యంగా నిర్దేశించుకున్నది. మొదటి సారి మొత్తం తెలంగాణ రాష్ట్రానికే మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తున్నది. క్యూర్, ప్యూర్, రేర్ గా తెలంగాణను వర్గీకరించి ముందుకు వెళుతుంది. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి భాగాన్ని క్యూర్ గా, ఔటర్ నుండి ట్రిబుల్ ఆర్ వరకు ఉన్న తెలంగాణను ప్యూర్ గా, ట్రిబుల్ ఆర్ నుండి తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న భాగాన్ని రేర్ గా వర్గీకరిస్తూ... ఆయా జోన్లలో 2047 నాటికి ఎటువంటి అభివృద్ధి నమూనా ఉండాలని సమగ్ర సమాలోచనలు చేసి ముందుకు వెళుతుంది. అటువంటి ప్రభుత్వంపై తమ రాజరిక, భూస్వామిక మనస్తత్వంతో నిందారోపణలు చేయడం ఏమాత్రం స్వాగతనీయం కాదు.

ఇక చివరగా, చరిత్రకు సంబంధించిన ఒక ఉదాహరణను పరిశీలించి చర్చను ముగిద్దాం. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు (16581707) తన సొంత తండ్రి షాజహాన్ ను జైల్లో బంధించి, తన సోదరుడు ధారాషికోను హత్య చేయించారు. ప్రస్తుతం పరిణామాలు చూస్తుంటే... తెలంగాణ సమాజానికి జౌరంగజేబు దొరికాడని యావత్ సమాజమంతా వెయ్యి కండ్లతో గమనిస్తున్నది. ఆ జౌరంగజేబు ఎవరో.. ఏంటో.. ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉందంటారా?

**సత్తు మల్లేష్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్. +91 91607 07444.**

## నవోదయ ఫలితాల్లో ప్రగతి విద్యార్థి ప్రభంజనం




**బూర్గంపాడు, విశాలభారతి:** ఈనెల 17వ తేదీన విడుదల చేసిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో స్టేట్ 4వ ర్యాంక్ సాధించిన బర్ల అయాన్ వేదిక్ ను మరియు తల్లి దండ్రులు రామకృష్ణ విజయలక్ష్మిని ప్రగతి స్కూల్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన విద్యార్థి ఇంత గొప్ప ర్యాంక్ సాధించడం పట్ల గర్వంగా ఉంది అని పాఠశాల కరెస్పాండెంట్ సానికొమ్ము చైతన్య అయాన్ వేదికను కొనియాడారు. అలాగే అతని విజయానికి ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అతను భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటూ మరెన్నో ర్యాంకులు సాధించాలని ఆశీర్వదించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న అయాన్ వేదిక్‌ను కొనియాడుతూ, అతను చదువుపై ఉన్న పట్టుదల, తపన మరియు మా పాఠశాల ఉపాధ్యాయుల కృషి ఈ విజయానికి నాంది అని తెలిపారు. ఈ విజయం అతని కుటుంబానికి, పాఠశాలకు మరియు సమాజానికి గౌరవాన్ని తీసుకొచ్చిందని గర్వపడ్డారు. నవోదయ పాఠశాలలో చదవడం గొప్ప అవకాశమని, తాను కూడా నవోదయ పాఠశాల విద్యార్థినని తన జ్ఞాపకాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. తదుపరి అయాన్ వేదిక్ మరియు తల్లిదండ్రులను శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు అయాన్ వేదిక్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఆర్ ఓ పైన విచారణ జరిపించాలి

- **ఎస్సీ ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్‌కు వినతి**
- **కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్**



**పాల్వంచ, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యని శుక్రవారం సారపాక గెస్ట్ హౌస్ లో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ గద్దల రమేష్ కలిసి వినతి పత్రాన్ని అందించారు ఈ సందర్భంగా గద్దల రమేష్ మాట్లాడుతూ పాల్వంచ మండలం దంతెలబోరా ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీలో సర్పంచ్ స్థానం ఎస్టీ రిజర్వేషన్ అయినందువలన ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 1/70 ఏజెన్సీ ఏరియాలో సర్పంచ్, మరియు వార్డులు ఎస్టీ రిజర్వేషన్ లో భాగంగా కుల ధ్రువీకరణ పాత్రలు లేకుండా అభ్యర్థులను రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో ) సుధాకర్, ఏ విధంగా ఆమోదించారో తెలియాల్సి ఉందని, అదే విధంగా గెజిటెడ్ డా.సురేష్ పాడ్యా , జూనియర్ లెక్చరర్ రమేష్ బాబు నామినేషన్ పత్రాల పైన సర్పంచు మరియు వార్డు సభ్యులకు ఏ విధంగా కుల ధ్రువీకరణ పత్రము జిరాక్సలు చూడకుండా ఎస్టీలు అని గెజిటెడ్ ఆఫీసర్స్ తో ఏ విధంగా సంతకాలు పెట్టినారో తెలపాలని డిమాండ్ చేశారు.ఓసి బిసి సామాజిక వర్గానికి చెందిన వారిని నామినేషన్ పత్రాలలో ఎస్టి సామాజిక వర్గానికి చెందిన వారేనని ఏ విధంగా గుర్తించారో తెలపాలని డిమాండ్ చేశారు.వీరి పైన ఉన్నతాధికారులు పూర్తి విచారణ జరిపించి, వీరి పైన చర్యలు తీసుకోవాలని, సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన ఇరప లక్ష్మికి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ ను బక్కి వెంకటయ్య ను కోరినారు

## ఆర్గానిక్ మిర్చిని పరిశీలించిన ఐటీడీఏ పీవో రాహుల్

- **రైతులు ఆర్గానిక్ పంటల సాగుపై మక్కువ చూపాలి**
- **ఆర్గానిక్ పంటలతో ఆరోగ్యం**



**బూర్గంపాడు, విశాలభారతి:** బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు యారం లక్ష్మిరెడ్డి మిర్చి పంటను పరిశీలించిన ఐటీడీఏ పీవో రాహుల్. ఆర్గానిక్ పంటలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఆర్గానిక్ పంటలకు మంచి రేటు పలుకుతుందని అన్నారు. రైతులు క్రిమిసింహారక రసాయన మందుల వాడకాన్ని తగ్గించి, ఆర్గానిక్ పద్ధతులను అవలంభించాలని ఆయన పేర్కొన్నారు. ఆదర్శ రైతు యారం లక్ష్మి రెడ్డిని ఆదర్శంగా తీసుకొని యువ రైతులు మేలైన దిగుబడులు సాధించాలని సూచించారు.

## సత్తుపల్లిలో నకిలీ విత్తనాల కలకలం

- **వెంకటరమణ సీడ్స్ ముందు రైతుల ధర్నా**
- **నకిలీ వరి విత్తనాలతో రైతులకు తీవ్ర నష్టం**
- **వెంకటరమణ సీడ్స్ వద్ద రైతుల ఆందోళన, ఉద్రిక్త పరిస్థితి**
- **చట్టపరమైన చర్యలు, నష్టపరిహారం కోరుతున్న బాధితులు**



**సత్తుపల్లి, విశాలభారతి :** సత్తుపల్లి పట్టణంలో నకిలీ వరి విత్తనాల వ్యవహారం రైతుల జీవితాలను కుదిపేసింది. స్థానికంగా ఉన్న వెంకటరమణ సీడ్స్ వద్ద కొనుగోలు చేసిన విత్తనాలు నాణ్యత లేనివిగా తేలడంతో సిద్ధారం, సదాశివునిపాలెం, రేజర్ల గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున ధర్నాకు దిగారు. రబీ సీజన్‌ను ఆశగా ఎదురుచూసిన రైతులు అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసినప్పటికీ అవి సరిగా మొలకెత్తకపోవడం, తాలు గింజలు రావడం వల్ల పంట పూర్తిగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మళ్లీ విత్తనం వేయాల్సిన పరిస్థితి ఏర్పడి అప్పుల బారిన పడుతున్నామని తెలిపారు. "మాకు నాణ్యమైన విత్తనాలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఒక్కో ఎకరానికి వేల రూపాయలు ఖర్చు పెట్టినా ఇప్పుడు ఖాళీ భూమి మాత్రమే మిగిలింది" అంటూ రైతులు వాపోయారు. ఈ సందర్భంగా రైతులు తమ డిమాండ్లను స్పష్టంగా వెల్లడించారు. నాసిరకం, నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై విత్తనాల చట్టం, 1966, విత్తనాల నియంత్రణ ఉత్తర్వు, 1983 ప్రకారం వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేసినందుకు బాధ్యులపై ఐపీసీ 420 కింద కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తమకు జరిగిన నష్టానికి వినియోగదారుల రక్షణ చట్టం, 2019 ప్రకారం పూర్తి నష్టపరిహారం అందించాలని, విత్తనాల నాణ్యతపై వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే పరీక్షలు నిర్వహించి నిజాలు బయటపెట్టాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టడి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## వెంకటాపురంలో అట్టహాసంగా జిల్లా స్థాయి ఎడ్ల పందాలు



**గుర్రంపోడు, విశాలభారతి :** నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పందాల పోటీలు అట్టహాసంగా ముగిశాయి. తెలంగాణ గిత్తల బల ప్రదర్శనలో భాగంగా నిర్వహించిన ఈ పోటీలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి .ఈ పోటీలను వెంకటాపురం సర్పంచ్ మల్లోజు రామాచారి, ఉట్లపల్లి సర్పంచ్ భీమనపల్లి శ్రావణి శ్రీను బాబు, మాజీ సర్పంచ్ బచ్చనబోయిన శీను యాదవ్, ముత్యాల భూపతి రాజు, సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ సంస్కృతిని, రైతు క్రీడలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఇలాంటి పోటీలు రైతుల్లో నూతనోత్సాహాన్ని నింపుతాయని పేర్కొన్నారు.జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన మేలు రకం గిత్తలు ఈ పోటీల్లో తమ ప్రతాపాన్ని చాటాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పందాల్లో విజేతలుగా ప్రథమ బహుమతి అనుముల గ్రామానికి చెందిన గిత్తలు కైవసం,ద్వితీయ బహుమతివెంకటాపురం గ్రామానికి చెందిన గిత్తలు,తృతీయ బహుమతి: కాల్వపల్లి గ్రామానికి చెందిన గిత్తలు, నాల్గవ బహుమతి తిరిగి ఆతిథ్య గ్రామం వెంకటాపురం గిత్తలకే దక్కింది.ఈ పోటీలను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుండి రైతులు, యువకులు మరియు ఎడ్ల పందాల అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కేరింతలు, ఈలల మధ్య గిత్తల బల ప్రదర్శన ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.



# పాతకాలపు ఆలోచనలు పక్కన పెట్టండి

కథకు ప్రాధాన్యతనిచ్చి, ఆ కథలో తన పాత్ర పరిధి ఎంత ఉన్నా.. నటించే జెన్యూన్ హీరోలు నేటికాలంలో లేరని నటి తాప్సీ అన్నారు. ఇటీవలే బాలీవుడ్‌లో హీరోల ఆధిపత్య ధోరణి, అభద్రతాభావంపై తాప్సీ హాట్ హాట్ కామెంట్లు చేశారు. ఇంకా మాట్లాడుతూ 'సినిమాలో తన పాత్ర కంటే హీరోయిన్ పాత్ర ఎక్కువగా ఉందంటే, చిన్నహీరోలు కూడా నటించడానికి వెనకడుగు వేస్తున్నారు. కథ ఎంత గొప్పదైనా సరే.. హీరోయిన్ డామినేషన్‌ని మాత్రం వాళ్లు సహించలేరు. ఈ అభద్రతాభావం చాలామంది హీరోలకు ఉంది. తెరపై హీరోయిన్ హైలైట్ అయితే.. తన ఇమేజ్ దెబ్బతింటుందని వారి భావన. ఇలా అయితే.. మంచి కథలు ఎలా వస్తాయి?' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది తాప్సీ పన్ను. 'కేవలం తమ పాత్రలకు మాత్రమే ప్రాధాన్యత ఉండాలి, హీరోయిన్లు పాటలకు మాత్రమే పరిమితం కావాలనే పాతకాలపు ఆలోచనల నుంచి పరిశ్రమ బయటకు రావాలని, నిజాయితీగా కథను ప్రేమించే నటులు ఉంటే వైవిధ్యమైన సినిమాలు వస్తాయని తాప్సీ అభిప్రాయపడింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.